ప్రజాశక్తి

Vol. 7, no. 4

(Jul. 25, 1945)

బెజవాడ, 1945

Record no. 683

Prajāśakti

Vol. 7, no. 4

(Jul. 25, 1945)

Bejavāḍa, 1945

Record no. 683

Regd. No M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 7 బుధవారం 25-7-45 సంచిక 4

పొరపాట్లు దిద్దుకోవడం ధీమంతుల లక్షణం

పట్టాభిగారి ఉపన్యాసానికి జవాబు

మద్దుకూరి చంద్రశేఖరరావు

ప్రతీక సందర్భాలలో సామాన్యమానవులు పొరపాటు పడవచ్చు. తప్పులు చేయవచ్చు. కాని చరిత్ర వాటిని తప్పని రుజువు చేసిందనుకోండి; మిత్రులే శుద్ధతప్పని అన్నారనుకోండి; అలాంటపుడు ఆ పొరపాటును గుర్తించి, దిద్దుకోవడం ధీమంతుల లక్షణం. అలా చేయక, కానుపట్టిన కుందేటికి మూడే కాళ్లనేకోడం మూర్ఖత్వమనిపించుకొంటుంది.

చూడండి: గాంధీభక్తుడైన మష్రూవాలాగారు శ్రీమిచేశారో. ఆగష్టు ఉద్యమదినాలలో ఆయన పొరపాటు బడ్డారు. నిరంకుశుడైన అమెరీ ఏవిందలను కాంగ్రెసుపై అపాదించాడో, వాటినే కాంగ్రెసు కార్యక్రమనుకొన్నారు. "హరిజన్"లో అలాగే వ్రాశారు. కాని గాంధీమహాత్ముడు అలాంటి భావాలను ప్రజలముందు పెట్టడం తప్పన్నారు. వెంటనే మష్రూవాలాగారు తన పొరపాటున్ను గుర్తించారు. 1944 అక్టోబరు 26 వ తేదీన వార్ధానుంచి చేసిన ప్రకటనలో యిలా తెలియచేశారు:

"మిస్టర్ అమెరీ తెలియజేసిన కార్యక్రమాన్ని నేమతర్కబుద్ధితో, లాయరువలె, పరిశీలించకుండా, అంతరాత్మయొక్క సలహాను పొందవలసింది. నేను నా అంతరాత్మ ప్రబోధాన్ని జాగ్రత్తగా తెలిసికోలేదు. అపుడు నాకు అందుబాటులోవున్న సహచరుల అభిప్రాయాల్ను కూడ తెలుసుగొనలేదు. దోపిడీని, విధ్వంసించడాన్ని నేను ఏవిధంగా వ్యతిరేకించానో, అదేవిధంగా తంతి తీగలను తెంచడం, రైలు పట్టాలను తొలగించడం, వంతెనలను కూల్చడం వగైరా రవాణా సౌకర్యాలను నాశనం చేయడాన్ని కూడ నేను వ్యతిరేకించాలిసింది" అని స్పష్టంగా ప్రకటించారు. (1944 అక్టోబరు 28 'హిందూ' పత్రిక).

నిజంగా మష్రూవాలా ఒక గొప్పపని చేశారు. తప్పు అంగీకరించారు. అందుచేత ముందుగా సరియైన మార్గమేదో తెలిసికోగలుగుతారు. నిజానికినిలబడేదీమంతులందరూ అనుసరించవలసిన మార్గమిది.

పట్టాభిగారి ధీమా

ఈ నెల 19వ తేదీన డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్య పంతులుగారు బెజవాడలో కాంగ్రెసు ఖాదీ వస్త్రప్రదర్శనాలయంలో జరిగిన బహిరంగసభలో ఉపన్యసించుతూ యిలా చెప్పారు:

"1942 నాటి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘం సర్క్యులర్ రచయితను నేనే. దానికి నేను వినా అన్యులెవ్వరూ బాధ్యులుకారు. గాంధీజీతో చర్చించినమీదటనే. ఆయన ఆదేశానుసారం, నేను ఆ సర్క్యులరును సిద్ధపరచాను. ఆ సర్క్యులర్ లోని విషయాలు గాంధీజీతో నేను క్షుణ్ణంగా చర్చించినమీదట ఆయన నాకు తెలిపినవే. దానిలో సూచించబడిన కార్యక్రమంలో మునిసిపల్ పన్నులు వినా తక్కిన పన్నులు చెల్లించకపోవడం. గీత గీయబడుతున్న తాటి, ఈతచెట్లను కొట్టి వేయడం. టెలిగ్రాఫ్ తీగలను త్రెంచడం. మొదలైనవి వున్నాయి. అయితే టెలిగ్రాఫ్ తీగలను త్రెంచడం విషయంలో అచర్యను శిఫార్సు చేయలేదుగాని, దానిపై నిషేధం లేదని తెలుపబడ్డింది. గాంధీజీ ఉద్దేశించిన బహిరంగ విప్లవంలో పైన పేర్కొనబడిన అన్ని విషయాలు వున్నవిగాని, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘమువారిచే జారీచేయబడినట్టు చెప్పబడుతున్న సర్క్యులర్ లో వున్నట్టు రైలుపట్టాలను తొలగించమనిగాని, వేగనులను, రైలుపెట్టెలను తగులబెట్టమనిగాని లేదు. ఈ చర్యలు వాస్తవానికి పూర్తిగా నిషేధించబడ్డాయి." అని పట్టాభిగారు ఉపన్యసించారు. (21-7-45 'ఆంధ్రప్రభ')

ఈ ఉపన్యాసంలోనే యింకో విషయాన్ని కూడ పట్టాభిగారు తెలిపారు. "ఆ ప్రఖ్యాత పత్రాన్ని హర్షిస్తూ కాంగ్రెసు కార్యవర్గము నిమ్మాలో నిర్ణయించడం ముదావహం." (21-7-45 'ఆంధ్ర పత్రిక').

పట్టాభి సీతారామయ్యపంతులుగారు గాంధీ మహాత్ముని శిష్యులు; భాష్యకారులు. కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యులు. అందుచే జాగ్రత్తగా, బాధ్యతతో, మాట్లాడవలసినవారు.

ఆంధ్రరాష్ట్ర సర్క్యులర్ కు బాధ్యత తమదేనను సత్యాన్ని అంగీకరించడంవరకు, ధైర్యంగలవనే. బాధ్యత తమపైవేసికొని

కగా వెంకట్రావుగారి విడుదలను కోరడం మెచ్చుకోవలసిందే. కాని దానిలోని కార్యక్రమం అంతా గాంధీజీ అంగీకరించారనడం సరియైనదా? వర్కింగ్ కమిటీ ఆ పత్రాన్ని హర్షించిందనటం నిజమా? నిజమా? అనే సందేహాలు తప్పక కలుగుతాయి.

వాస్తవమేమిటి ?

తమదేనని పట్టాభిగారు అంగీకరించిన ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సర్క్యులర్ ను గురించి గాంధీజీ ఏమన్నారో చూదాం. ఆయన ప్రభుత్వానికి యిచ్చిన జవాబులో యిలా వ్రాశారు:

"సర్క్యులర్ లో వున్న విషయాలను గురించి, వాటిలో కొన్నిటికి నేను బాధ్యత వహించజాలను. కాని ఒకవేళ ఆసర్క్యులర్ నిజమైనప్పటికీ ఆంధ్రకమిటీ తన అభిప్రాయం తెలుపడానికి అవకాశం లేనపుడు నేను ఆ విషయంలో నిర్ణయమివ్వ నిరాకరించుతాను." అని 1943 జూలై 15వ తేదీన ప్రభుత్వానికి వ్రాసిన జాబులో గాంధీజీ తెలిపారు.

అంటే ఏమిటి? ఆ సర్క్యులర్ లోని కొన్ని విషయాలతో గాంధీజీ ఏకీభవించడం లేదు. అది ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుకమిటీ పంపినదో, లేక కల్పితమో ఆయనకు తెలియదు. అందుచే జడ్జిమెంటుయివ్వ నిరాకరించారు. ఐనప్పటికీ ఆ కార్యక్రమంలో కొన్నిభాగాలకు తాను బాధ్యత వహించజాలనని స్పష్టపరచారు.

కాని పట్టాభి సీతారామయ్యపంతులుగారో, "గాంధీజీతో చర్చించినమీదటనే, ఆయన ఆదేశానుసారం, నేను ఆ సర్క్యులర్ ను సిద్ధపరచాను" అని అంటున్నారు. ఒకవైపున గాంధీజీ ఆ సర్క్యులర్ లోని భాగాలకు తాను బాధ్యత వహించజాలనంటున్నారు. మరొకవైపున పట్టాభిగారు, "గాంధీజీ ఉద్దేశించిన బహిరంగ విప్లవంలో పైన పేర్కొనబడిన అన్ని విషయాలు వున్నవి" అంటున్నారు; ఇందులో ఏది నిజం? మహాత్ముని మాట సత్యమా? భాష్యకారునివాదన నిజమా?

అజాద్ లేఖ

1943 ఫిబ్రవరి 13వ తేదీన కాంగ్రెసు వర్కింగ్ కమిటీ తరపున మౌలానా అజాద్ ప్రభుత్వానికి ఒక లేఖ వ్రాశారు. అందులో ఆంధ్రరాష్ట్ర సర్క్యులర్ ను గురించి యిలా వ్రాశారు:

"ఈమధ్య ప్రభుత్వం ఉత్తర ప్రత్యుత్తరాలను ప్రకటించిన తరువాత వారి ప్రకటనలో ఒకవిషయం ఉదహరించబడింది. అందులో ప్రభుత్వం ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘ సర్క్యులర్ విషయం తెచ్చింది. మాకు దీని విషయమై ఏమీ తెలియదు. బాధ్యతగల ఏ కాంగ్రెసు సంఘమైనా ప్రధాన కాంగ్రెసు సూత్రాలకే విరుద్ధమైన విధంగా అవసరమైన సూచనలను పంపుతుందని మేము [illegible] నింప జాలకున్నాము." (1944 నవంబరు 2, 3 తేదీల 'హిందూ' పత్రిక)

అజాద్ లేఖ ఏమి తెలియజేస్తుంది? సర్క్యులర్ లోని సూచనలు కాంగ్రెసు ప్రధాన సూత్రాలకే విరుద్ధమైనవని, అవసవ్యమైనవనీ స్పష్టపరుస్తూంది. బాధ్యతగల వారెవరూ అలాంటి సూచనలు చేయరంటూంది. దానిని వాస్తవంగా ఆంధ్ర కాంగ్రెసు కమిటీ ప్రకటించిందని నమ్మజాలమంటూంది. కాని, పట్టాభిగారో: గాంధీగారే ఆ కార్యక్రమాన్ని అంగీకరించారంటున్నారు.

పైగా పై ఉపన్యాసంలో పట్టాభిగారు "ఆపత్రాన్ని హర్షిస్తూ కాంగ్రెసు కార్యవర్గం నిర్ణయించిందని" కూడా తెలియజేశారు. కాంగ్రెసు వర్కింగ్ కమిటీ అంతటి తరపునా అజాద్ వ్రాసిన లేఖ సరియైనదా? లేక పట్టాభిగారి వాదన సరియైనదా?

గాంధీజీ, అజాద్ లు కూడ అలాంటి కార్యక్రమం తామివ్వలేదంటున్నారు. అసలు ఆ సర్క్యులరే కల్పితమేమోనని విస్తుబోయారు. కాని, పట్టాభిగారు మాత్రం అది గాంధీగారిచ్చిన కార్యక్రమమంటున్నారు. వర్కింగ్ కమిటీ హర్షించిందంటున్నారు. ఏది నిజం?

అసలు సంగతి

అది గాంధీజీయే అంగీకరించిన కార్యక్రమమైతే, భారతదేశంలో మరే రాష్ట్రకాంగ్రెసు కమిటీ యిలాంటి సర్క్యులర్ ను ఎందుకు జారీ చేయలేదు? అఖిలభారత కాంగ్రెసు వర్కింగ్ కమిటీయే ఆ కార్యక్రమాన్ని వివిధ సంఘాలకు జారీచేయాలసింది గదా? అలాంటిదేమీ జరుగలేదేమి?

బొంబాయి అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశానికి ముందుగానే ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ తరపున ఈ సర్క్యులర్ జారీచేయబడింది. పట్టాభిగా రంటూన్నట్లు, దానిలో 'రైలుపట్టాలు పీకమని, పెట్టెలను తగులబెట్టమని' లేకపోవచ్చు. కాని "పన్నులు చెల్లించకపోవడం, తాటి-ఈత చెట్లను కొట్టి వేయడం, టెలిగ్రాఫ్ తీగలను త్రెంచడం మొదలైన" కార్యక్రమం ఉందని పట్టాభిగారే అంగీకరించుతున్నారు. అఖిలభారతకాంగ్రెసు ఏ తీర్మానమూ చేయకముందే ఇలాంటి కార్యక్రమాన్ని పట్టాభిగారు ఎందుకు సర్క్యులర్ ద్వారా పంపారు? పట్టాభిగారి మాటలు నిజమైతే, గాంధీజీకి ఇలాంటి కార్యక్రమం అంగీకరించడానికి అధికారం ఎప్పటినుంచి వచ్చింది? తరువాత జరిగిన బొంబాయి సమావేశంలో గూడా (మిగతా 2వ పేజీలో)

'ప్రజాశక్తి'కి రు 18000 లు 'కారుమంచి' కానుక

గుంటూరుతాలూకా పార్టీజనరల్ బాడీసమావేశం

ఆరోజుకు, నెలకుదుటి నాగేశ్వరరావు కాలంచేసి 18 రోజులైంది. అతని ఆదర్శ ప్రజాసేవను స్మరించుకుంటూ పురోగమించ డానికి వివిధ గ్రామాల నుంచి బంధు మిత్రులువచ్చారు. పార్టీసభ్యులు, సానుభూతి పరులు ఆసమావేశాని కందుకున్నారు. గొప్ప ఊరేగింపు జరిగిన అనంతరం సభాధిపై ఎర్రజెండా నెగురవేస్తూ "నెలకుదుటి" ఆద ర్శం ప్రకారం నడువమని ప్రబోధించారు. కామ్రేడ్ సుందరయ్య.

350 మందితో గుంటూరు తాలూకా పార్టీ సభ్యుల జనరల్‌బాడీ సమావేశం ప్రారంభమయింది. కామ్రేడ్ సుందరయ్య కాన్‌ఫ్రెన్సుస్కో సమావేశము, సిమ్లాసమా లోచనలు వివరించి, ఆంధ్రకాంగ్రెసు అసెంబ్లీ వాదులఅపకతవకలను వరకుచేయక, జాతీయ కాంగ్రెసుయొక్క గౌరవ సాంప్రదాయాలను కాపాడాలన్నారు. "ప్రజాశక్తి" దినపత్రికకై వందుకు విజ్ఞప్తిచేశారు. వందు అని ముగించక ముందే కామ్రేడ్ కారుమంచి వెంకటేశ్వర రావులేచి తనవంతు 10 యకరాలు అన్నాడు. (సుమారు రు. 18000 లు ఖరీదు చేస్తుంది) అందరికీ ఆశ్చర్యాన్ని కలిగింది. అందరూ యెరిగి న వా రు వా శ్చ సా యు న. ధనిక కు టుం బం అది. సరదాగా కాల క్షేపం చేయడం కట్టిపెట్టి, కమ్యూనిస్టు పార్టీలో చేరారు వెంకటేశ్వరరావు. విద్యా విజ్ఞానాలను అలవరచుకుంటూ ప్రజాసేవలో వ్యక్తి జీవితాన్ని తీర్చి దిద్దుకున్నారు. వ్యకుటుంబంలోని సంకుచితత్వాన్ని విడనాడి మానవ సాంప్రదాయాన్ని, త్యాగశక్తిని వవేశపెట్టాడు.

కామ్రేడ్ దొంతరాజు దంపతులు, కృష్ణ మూర్తిసీతారామమ్మగారలు(నంబూరుగ్రామం) వెనుకటి వాగ్దానముతో కలిసి రు. 700 లు యిచ్చారు. కామ్రేడ్ వల్లూరి రామకృష్ణయ్య (పెదవడ్లపూడి) అవసరం వచ్చినప్పుడల్లా పార్టీకి వంద, రెండువందలు యిస్తూండేవాడు. మరల రు. 600 లు వాగ్దానం చేశాడు. వరు సగా పొన్నెకల్లు, నేలపాడు, తాడికొండ, పెదవడ్లపూడి, తుళ్ళూరు మొదలయిన కేంద్రాలనుంచేగాక క్రొత్తగా కాంటాక్టులోకి వచ్చిన వెంగళాయిపాలెం, చింతపల్లిపాడు, వల్లపాడు గ్రామాలనుండి వయితం వదులు, పాతికలు, వందలు ఉత్సాహంతో వాగ్దా నాలు గావించారు. నేలపాడు వ్యవసాయ కూలీ కామ్రేడ్స్, తుళ్ళూరు మహిళలు తమ శక్తికొలది జాబితాలువ్రాసి పంపించారు. వృద్ధ మూర్తి పూరే సుబ్బారావుగారిది మంగళగిరి. 25 ఏళ్లనుండి కాంగ్రెసువాదిగా పాటుబడ్డారు. 1942 ఆగస్టు సంఘటనల చేరలేదని పార్టీపై వైషమ్యం వహించారు. నిజము నిలకడమీద తెలుసుకున్నారు. కమ్యూనిస్టులను తూలనాడు తున్న రంగా, కాశేశ్వరరావుల దుష్ప్రచా రాన్ని సహింపలేక పోయారు. కాంగ్రెసు సాంప్రదాయాలను ఆచరణలోపెట్టి ప్రజా సేవయే పరమావధిగా పనిచేసే కమ్యూనిస్టు పార్టీలో తానూ జేరారు. నిరుపేద అయినా, ట్యూషన్‌తో సంపాదించే కొద్ది మొత్తము నుంచే రు. 10 లు "ప్రజాశక్తి" ఫండు కిచ్చారు. నెలకుదుటి అస్తమించిన నాట నుండి నిద్రాహారాలు లేకుండా నిరుత్సా హంగా వుంది శేషగిరమ్మ. భర్తకు తోడు నీడగా పార్టీ శ్రేయస్సును కోరింది. నాగేశ్వ రావే వుంటే "ప్రజాశక్తి" కోసం ఎంత త్యాగంచేసేవాడో మరల ! ఆతని ఆశయాన్ని నెరవేర్చేబాధ్యత తాను వహించింది. కనుకనే రు. 275లు. రొఖం యిచ్చి పంపింది.

గుంటూరు తాలూకాలో ప్రధానంగా రాజ కీయాలు ప్రవేశపెట్టి ప్రజాసేవ చేస్తున్నది పార్టీ కామ్రేడ్సే. "ప్రజాశక్తి" పిలుపుకై మొత్తం రు 28000లువిరాళాలు తామే వాగ్దానం చేశారంటే, యింకా ప్రజలనుండి కొరతే ముంటుంది ?


గుంటూరు టౌన్ జనరల్ బాడీసమావేశం

జూలై 15న గుంటూరు పట్టణంలో పార్టీ సభ్యులు, సానుభూతిపరులు 100 మంది సమావేశమయ్యారు. విద్యావిజ్ఞానాలలో పుట్టి పెరిగిన కామ్రేడ్స్ వెంకటరెడ్డి, గోపాల కృష్ణయ్యగార్ల (లాయర్లు) నుండి మున్సి పాలిటీలో పాకీపనిచేసే మహిళా కామ్రేడ్సు లక్ష్మమ్మ, నరసమ్మలవరకు హాజరయ్యారు. జిల్లాకార్యదర్శి, జాతీయ, అంతర్జాతీయ రాజ కీయాలను సింహావలోకనంజేసి, "ప్రజాశక్తి" ఫండుకై విజ్ఞప్తిచేశాడు.

కామ్రేడ్ వేల్పూరి సుబ్రహ్మణ్యం అభ్యు దయకవి, టుబాకోమార్కెటుకమిటీ ఉద్యోగి, ప్రక్కనే కూర్చున్నాడు. జీవితానికి మించి ఆదాయమేమీలేదు. అభ్యుదయ మార్గాన్నను సరించే "ప్రజాశక్తి"పైగల గావాభిమానంతో నెలజీతం రు. 50 లు తెచ్చి యిచ్చాడు. హోటల్‌వర్కర్సు యూనియన్ కార్యదర్శి కామ్రేడ్ గురుమూర్తి మధ్యనుండి లేచి, నెల జీతం రు. 35లు వాగ్దానంచేశాడు. మున్సిపల్ వర్కర్సులో పార్టీ హోల్‌టైమరుగా పనిచే స్తున్నకామ్రేడ్ బ్రహ్మానందరావు పార్టీ వేతనం లోనే పదుకొని రు. 50 లు యిస్తానన్నాడు. ప్రభుత్వోద్యోగులుగా వున్న మరి యిద్దరు కామ్రేడ్స్ తమ నెలజీతాలు "ప్రజాశక్తి" ఫండుకు ప్రకటించారు. కామ్రేడ్ వెంగలి శెట్టి తిరుపతయ్య కొద్దిపాటి ఉద్యోగం చేస్తూ ఏడెనిమిది సంవత్సరాలనుండి పార్టీ కార్యక్రమంలో పాటుపడుతున్నాడు. ఏటేటా ఒకటి, రెండు వందలు పార్టీఫండుకు యిస్తు న్నాడు. రు. 500 లు స్థలం అమ్మి యిస్తా నని చెప్పారు. కామ్రేడ్ వెంకటరెడ్డి 100 రూపాయలు వాగ్దానం. వరుసగా మున్సిపల్ లాగుడుబండ్ల కార్మిక కామ్రేడ్స్ తమ వాగ్దా నాలన్నీ ప్రకటించారు. రు. 1000 లు వరకు వసూలుచేసి పార్టీకి సమర్పించాలనుకున్న లాగుడుబండ్ల కార్మిక కామ్రేడ్స్ కాయకష్ట ముతో సంపాదించి, విరాళాలు వసూలుచేసి రు. 400 లు దాకా యిచ్చారు. మిగతా రు. 600 లు త్వరలో వసూలుచేసి యిస్తా మని "ప్రజాశక్తి"పై తమకు గల ఆదరణను తెలిపారు. మొత్తం టవున్ కామ్రేడ్స్ వాగ్దానాలు రు. 2300 లు.

గ్రామజీవితంలో పుట్టిపెరిగిన రైతు-కూలీ కామ్రేడ్సు, పట్టణాలలో పరిశ్రమలలో పాటు బడే కార్మికపుత్రులు, విద్యా విజ్ఞానాలలో జీవించే మేధావులు అంతా "ప్రజాశక్తి"ని దినపత్రికగా చేసి, ప్రజా ఉద్యమాన్ని నిర్మిం చాలని అభిలషిస్తున్నారు. ఆశయసిద్ధికై అంతు లేని త్యాగాలతో ముందుకురుకుతున్నారు.

— ప్రా విలేఖరి.



కామ్రేడ్ కారుమంచి వెంకటేశ్వరరావు

(1 వ పేజీ తరువాయి) గాంధీగారికి సత్యాగ్ర హం నడపడానికి అధికారమిచ్చింది !

ఇంకో సంగతి. అజాద్‌గారు ఆంధ్ర సర్క్యులర్‌తో తమకెట్టి సంబంధంలేదని వర్కింగ్‌కమిటీ అందరితరపున ప్రభుత్వానికి లేఖ వ్రాశారు. అపుడు పట్టాభిగారుకూడ అజాదువున్న జైలులోనే వున్నారు. అపుడే పట్టాభి అజాద్‌లేఖకు ఎందుకు అభ్యంతరం పెట్టలేదు ? తానే ఆ సర్క్యులర్ వ్రాయించా నని ఆజాద్‌తో ఎందుకు చెప్పలేదు. అపుడు తామకూడ అజాద్ లేఖకు ఎందువల్ల తల వూపారు ? అపుడు 'అపసవ్యమని' పిలిచిన సర్క్యులరునే యిపుడు వర్కింగుకమిటీ సిమ్లా సమావేశంలో ఎందుకు హర్షించింది ? వీటికి పట్టాభిగారు సమాధానం చెబుతారా ?

ఇంకా పట్టాభిగారు బెజవాడ ఉపన్యా సంలో, ఆగస్టు తీర్మానం ప్యాసుకావడంతోనే ఉద్యమం ప్రారంభమైనట్లు సెలవిచ్చారు. ఈ సందర్భంలో పట్టాభిగారికి ఒక విష యం జ్ఞాపకం చేస్తున్నాము. బొంబాయి అఖిల భారత కమిటీ సమావేశంలో అధ్యక్షులైన మౌలానా అజాద్‌గారు వెంటనే పోరాటాన్ని తాము ఉద్దేశించలేదని స్పష్టపరచారు. హిందూ - ముస్లిం ఐకమత్యాన్ని సాధించ డానికి కృషిచేస్తామన్నారు. మిత్రరాజ్యనాయ కులైన రూజువెల్టు, చంగ్-కై-షేక్, స్టాలి నులకు విజ్ఞప్తి చేస్తామన్నారు. భారత సమ స్యను పరిష్కరించడానికి వారి సాయం అర్థించుతామన్నారు. అలాంటపుడు తీర్మానం ప్యాసు అవుటతోనే ఉద్యమం ప్రారంభమ య్యిందనను పట్టాభిగారి వాదన సరియైనదికాదు. వాస్తవిక పరిస్థితులకే విరుద్ధమైనది.

కాని పత్రికలలో వచ్చిన రిపోర్టులో పట్టాభిగారు ఈ విషయమై కాస్త జాగ్రత్త వహించి దిద్దుకున్నారు. నాయకుల అరెస్టు తోనే దేశంలో కల్లోలం ప్రారంభమయిం దని చెప్పుకొన్నారు.

ఇంతవరకు ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు సర్క్యు లర్‌లోని విషయాలను "ప్రజాశక్తి" చర్చించ లేదు. వివరాలలోకి పోలేదు. గాంధీజీ, అజాద్‌గారలుప్రకటించినట్లుగానే మేముకూడ ఇది కాంగ్రెసు కార్యక్రమం కాదని వాదిం చాము. కాని యిపుడు పట్టాభిగారు తామే బాధ్యులమని చెప్పారు. ఆ కార్యక్రమాన్ని గాంధీజీయే యిచ్చారని సమర్థించారు. అందుచే వివరాలలోకివెళ్ళి, యిపుడు దీన్ని చర్చించవలసి వచ్చింది.

పట్టాభిగారి వాదనలో పస ఏమీలేదని రుజువుచేశాను. కాంగ్రెసు అధ్యక్షుడైన అజాద్, గాంధీమహాత్ముడు, మష్రూవాలా గారల ప్రకటనలనుచూపి, ఆ సర్క్యులర్ లోని కార్యక్రమం పూర్తిగా పొరబాటని తేట తెల్లం చేశాను.

దేశక్షేమానికి విరుద్ధమైన కార్యక్రమం

తీగలుతెంచడం వగైరా కార్యక్రమం దేశ క్షేమానికి విరుద్ధమైనదని మేము గత మూడు సంవత్సరాలనుంచి వాదించుతున్నాము. బొం బాయి తీర్మానంలోచెప్పబడిన "మిత్రమండలి విజయాన్ని కోరుతున్నా"మనే ఆశయానికి విరుద్ధమని మేము ప్రజలకు విన్నవించాము. కోపంతో రెచ్చిపోయిన దేశభక్తులకు, ప్రజ లకు విధ్వంసక చర్యలు కాంగ్రెసు కార్య క్రమం కాదని చెప్పాము. ఆలాంటిపనులు చేయకుండా సాధ్యమైనచోటల్లా ప్రజలకు నచ్చచెప్పి ఆపుచేశాము. దేశక్షేమాన్నికోరే ప్రజాసేవకులుగా మేము ఆరోజులలో మా కర్తవ్యాన్ని నెరవేర్చామని ఇప్పటికీ సవిన యంగా, ధీమాతో చెప్పుకుంటున్నాము.

కాని పైసభలోనే కాశేశ్వరరావుగారు, పై పనులు చేసినందువ కమ్యూనిస్టులు దేశ ద్రోహులని దుమ్మెత్తిపోశారు. ఒకవైపున పట్టాభిగారు కాంగ్రెసుకు అపఖ్యాతితెచ్చిన "ఆంధ్రరాష్ట్ర సర్క్యులర్‌ను" సమర్థించారు. అంతటితో సరిపుచ్చితే పాపభారమంతా ధీమాగా తమపైవేసుకొని, కళా వెంకటరావు వగైరాల విడుదలకు హెచ్చరిక చేశారని సంతోషించి ఊరుకునేవారము. కాని అలా జరుగలేదు. జరిగిపోయిన పొరపాట్లను, అజాద్ గాంధీజీలచే నిరసించబడిన వాటిని కూడ సమర్థించారు. అంతేగాక, మేము ఆ పొరపాట్లు చేయనందుకు, ఆ బురదలో దిగనందుకు ఇతర ఉపన్యాసకులు మమ్మ లను దేశద్రోహులనడానికికూడా సిద్ధమ య్యారు.

పట్టాభిగారికి మా జవాబు

పట్టాభి సీతారామయ్య పంతులుగారికి యిదే మా జవాబు: ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సర్క్యులర్‌ను వేయడంలో మీరు పూర్తిగా పొరపాటుపడ్డారు. ప్రజలను, కాంగ్రెసు వాదులను తప్పుదుపంథాలోపెట్టడానికి కారకు లయ్యారు. నాయకులు జైళ్ళలోకి వెళ్ళాక ఆ తప్పుదువంథాకాంగ్రె(మిగతా 10వ పేజీలో)

సిమ్లాసమావేశం ఎలా భగ్నమైంది?

— పి. సి. జోషి

సిమ్లా సమావేశం భగ్నమయిందనే వార్తనువిని ప్రజలందరూ విచారపడ్డారు. "పీపుల్సువార్" విలేఖరులు బొంబాయిలో దాదాపు వెయ్యమంది పౌరులను కలసి కొన్నారు. అన్నివర్గాలవారు, మతాలవారు యీవార్తను ఎంతో విషాదంతో విన్నారు.

కాని, ఏకాభిప్రాయం అంతవరకే; ఇంక వైఫల్యానికి కారణాలనుగూర్చి ఒక్కొకరు ఒక్కొకవిధంగా భావించుతున్నారు. చాల మంది కాంగ్రెసువాదులు జిన్నాది వట్టి వితండ వాదమంటున్నారు. సామ్రాజ్యవాదుల ఏజెం టుగా భావించుతున్నారు. వేవెల్ ప్రతిష్టంభ నను తొలగించడానికి సరిగా పూనుకోలేదు; అందుచేతనే జిన్నా అటంకాలను త్రోసివేయ లేదు. బ్రిటిషువాళ్ళు-ముస్లిములుకలిసి కుట్ర చేసి భారత స్వాతంత్ర్యానికి అడ్డుపడ్డారు—అని వారు భావించుతున్నారు.

చాలమంది ముస్లింలీగ్ ప్రజలు మౌలానా అజాద్‌ను పెద్ద నేరస్థుడుగా ఎంచుతున్నారు. ముస్లిం ప్రజలకు ద్రోహంచేసి, హిందువుల ఏజెంటుగా పనిచేస్తున్నారు; జిన్నా దాక చక్యంగా ప్రవర్తించి, పాకిస్తాన్‌కు విరు ద్ధంగా బ్రిటిషువాళ్ళు, హిందువులు కలసిచేసిన కుట్రను ఓడించివేశాడు -అని లీగ్‌అభిమాను లైన ముస్లింలు భావించుతున్నారు.

ఇంక సామాన్యంగా హిందూ - ముస్లిం ప్రజలసంగతి. వారూ దేశభక్తులే; కాని వారు ఒండొరులను పైవిధంగా నిందించుకోడం లేదు. సిమ్లా సమావేశం అలా భగ్నమయి వుండాలసిందికాదని భావించుతున్నారు. ఏదో ఒకమార్గం కనుగొనవలసిం దంటున్నారు. అంతకంటే వారు స్పష్టంగా ఏమీ చెప్పలేక పోతున్నారు.

విద్యార్థులు, కాంగ్రెసు నాయకులు సిమ్లాలో అనుసరించిన పంథాను అంతగా హర్షించడం లేదు. కొంతమంది ఈ ముసలివాళ్ళకు చేత కాదు; వీళ్ళు పోవాలంటున్నారు మొత్తం మీద ప్రజలందరూ రాయబారాలు విఫలమయి నందుకు విచారపడుతున్నారు.

ఎవరు సంతోషించారు ?

అవాంఛితులైన కొలదిమంది మాత్రం సంతోషపడుతున్నారు. దేశానికి కలిగిన నష్టాన్ని తమవిజయంగా చూచేవాళ్లు ఎవరు?

వీరిలో మొట్టమొదటివాళ్ళు రాయిస్టులు. రాయిస్టుల మరాటీ దినపత్రిక సంపాదకీయం లో: "సిమ్లాసమావేశం భగ్నమయింది; భారత ప్రజలు దీన్ని మోక్షదినంగా భావిం చాలి" అని సంతసించింది.

ఒకవైపుబ్రిటిషుసామ్రాజ్యవాదులఏజెంట్లు రాయిస్టులు యిలా సంతోషిస్తూంటే, రెండో వైపు జపాను ఏజెంటు సుభాస్ చంద్రబోసు జూలై 16 వ తేదీన షొనాన్ రేడియోలో యిలా చెప్పాడు:

"ఈ సమావేశంలో పాల్గొనడంద్వారా కాంగ్రెసుకు ఏమీ లాభం కలుగలేదు. బ్రిటిషు సామ్రాజ్య ప్రతినిధి వేవెలు దయ సంపా దించడానికి, రాజీకొరకు కాంగ్రెసు ఆతురత చూపి అసహ్యంగా ప్రవర్తించింది. అలా చేయడం కాంగ్రెసు ఆశయానికి, భారతదేశ లక్ష్యానికి నష్టదాయకం.... సిమ్లా సమా వేశాన్ని భగ్నంచేసినందుకు, కాంగ్రెసు యుద్ధంలో పాల్గొనే అవకాశం లేకుండా చేసి నందుకు జిన్నాకు వందనాలు అర్పించాలి," అన్నాడు బోసు.

హిందూ మతము, హిందూ మెజారిటీ రక్షింపబడిందనీ,ముస్లింలీగ్ యొక్క బలిపీఠానికి హిందూమతం అర్పణచేయబడలేదనీ హిందూ మహాసభవారు సంతసించారు. అధ్యక్షుడు శ్యామప్రసాద ముఖర్జీ, "సిమ్లా సమావేశం భగ్నమయినందుకు విచారపడనక్కరలేదు," అన్నాడు. కాని యిందుకు ఎవరిని కొనియా డాలో వారికి తెలియడంలేదు. భగ్నమవడం వల్ల బ్రిటిషు సామ్రాజ్యవాదుల పెత్తనం అలాగే వుండిపోయిందనే విషయం వారు ఆలోచించడంలేదు.

కాంగ్రెసు సోషలిస్టులు కూడా కొందరు సంతసించుతున్నారు. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారానికి బిర్లా కంపెనీ డబ్బుతింటున్న 'బీర్బల్' యిలా వ్రాశాడు:

"కాంగ్రెసువాదులలో కొందరు మంత్రి పదవులు, పార్లమెంటరీ కార్యదర్శుల పద వులు, రాయబార పదవులు మొదలైనవాటి కోసం యెదురుచూస్తున్నారు. కాని అందరూ యిలాకాదు. మెజారిటీ, కాంగ్రెసు భవిష్యత్తు ఏమికానుందా అని వ్యధపడుతున్నారు. ముఖ్యులను ఢిల్లీకి యిచ్చివేస్తే, ప్రభు త్వాన్ని బలపరచే సంస్థగా కాంగ్రెసుతయారు కాదా ?" అని విస్తుపోయాడు 'బీర్బల్'.

సిమ్లాసమావేశం భగ్నంకావడంగురించి సంతసించేవారిలో యిలా అనేక గోత్రాల వారున్నారు. వారంతా వేరువేరు దృక్పథాల నుంచి బయలుదేరినప్పటికి, ఒకేవాదనకు దారితీస్తున్నారు, భగ్నమయినందుకు సంత సించుతున్నారు.

మొదట మా హెచ్చరిక

సిమ్లా సమావేశం జయంపొందుతుందని దాదాపు పత్రికలన్నీ, నాయకులందరూ ఆశిం చారు. అదిగో ఒడంబడిక; అని ఎదురు చూచారు. దేశమంతా ఊహాగానంలో వుండి పోయింది.

మా పార్టీమాత్రం భగ్నమయే ప్రమాదం వుందని ముందుగానే హెచ్చరించింది, అం దరూ పొరపాటుపడుతూంటే, మేము ఎందు చేత వాస్తవాన్ని కనుగొనగలిగాము ?

మార్క్సిజము మాకు శాస్త్రీయ విజ్ఞా నాన్ని కలుగజేస్తూంది. అందుచే మన జాతీయ బలహీనతలను తొలగించుకుంటే గాని జాతీయ పోరాటంలో జయించ లేము—అనే సత్యాన్ని తెలిసికోగలిగాము. జాతీయసైన్యంలో వచ్చిన విభేదాలను మన సేనానులు తొలగించకపోతే, మనకు విజయం ప్రాప్తంకాదని తెలిసి కున్నాము. మన ప్రధాన రాజకీయ సంస్థలమధ్య అనైక్యతవుంటే భారత దేశానికి విజయం ఎలావస్తుంది ?

మనలో మనకు చీలికలుంటే, మన స్వాతంత్ర్యోద్యమానికి అపజయం వస్తుందని మేము తెలిసికోగలిగాము. ఆచరణలో అలాగే జరిగింది.

ఇంకో విషయమేమంటే, బ్రిటిషు సామ్రాజ్యవాదులనుగురించి మాకెట్టి భ్రమలు లేవు. అందుచే ఊహాగానానికి మేం తావివ్వ లేదు. కాంగ్రెసు నాయకులు, లీగునాయకులు బ్రిటిషు పరిపాలకుల ఉదారస్వభావాన్ని గురించి పొగడసాగారు. ఎవరికివారే తమ కోర్కెలు న్యాయమైనవనీ, వేవెలు వాటిని గుర్తించుతాడని విశ్వాసం వెల్లడించారు. అలా పొరపాటుమార్గాన పడ్డారు.

ప్రతిష్టంభనను తొలగించడానికి ఒక చక్కని అవకాశం వచ్చిందని వేవెల్ ప్లానును మేము ఆహ్వానించాము. కాని అందులోవున్న ప్రమాదాలను గురించికూడా హెచ్చరించాము. ఇతరులు సామ్రాజ్య వాదుల ఎత్తులను గ్రహించనేలేదు.

అసలు సామ్రాజ్యవాదుల ఎత్తు ఏమిటి ? ప్రతిష్టంభనను తొలగించడానికి చర్చిల్ - అమెరీలు క్రొత్త ప్లానును ఎందుకు అంగీక రించారు ? దానిలో తమకు ఏయే రక్షణలు పెట్టుకున్నారు ?

సామ్రాజ్యవాదుల ఎత్తులు

1. పాతరాజ్యాంగం క్రిందనే ప్రజాపలుకు బడి కలిగిన నూతన కార్యనిర్వాహకవర్గం ఏర్పడాలన్నారు. వైస్రాయి వీటో అధికారం అలాగే ఉండాలన్నారు. భారత నాయకులకు యిది శ్రావ్యంగా వుండటానికి వీటో అధి కారం తప్పనిసరి అయినపుడు మాత్రమే ఉపయోగించుతామన్నారు. సమావేశంలోను, రాయబారాలలోను వేవెల్ మృదువుగా మాట్లాడి, తన నిజాయితీని రుజువు చేసి కుంటాడన్నారు.

2. భారత నాయకులు ఎక్జిక్యూటివ్ కౌన్సి లర్ల పేర్లను సూచించాలన్నారు. ఎవరిని తీసికోవాలి అనే నిర్ణయం బ్రిటిషు ప్రభుత్వ అనుమతితో వైస్రాయి చేస్తాడన్నారు. కాని అలా నిర్ణయించేముందు నాయకులతో సంప్ర దించుతామన్నారు.

3. రాజీ అందరికీ అంగీకృతమైనదిగా వుండాలన్నారు. వేవెలు తన రేడియో ఉప న్యాసంలో యిలా చెప్పాడు:

"దురదృష్టవశాత్తు సమావేశం విఫల మయితే, వివిధపార్టీలు రాజీపడేవరకు మేము యిప్పటివలెనే ప్రభుత్వాన్ని కొనసాగించు తాము. రాజీ కుదరకపోతే ఇండియాకు ఎంతో విలువైన సేవచేసిన ప్రస్తుత ఎక్జిక్యూ టివ్ కౌన్సిలే కొనసాగుతుంది. కాని సమా వేశం జయప్రదమవుతుందని ఆశించుతాను. పార్టీనాయకులు ఒండొరులతోను, నాతోను కలసి పనిచేయాలనే దృష్టితో యీసమస్యను వీక్షించుతారని ఆశించుతాను."

ఇండియామంత్రి పార్లమెంటులో జూన్ 14 వ తేదీన యిలా చెప్పాడు: "ప్రధాన భారత కమ్యూనిటీల కోర్కెలకు విరుద్ధంగా ఏవిధమైన మార్పులను ప్రవేశపెట్టాలని రాజు గారి ప్రభుత్వం ఉద్దేశించుటలేదు. ప్రధాన భారత పార్టీల నాయకులు మాసూచనలను అంగీకరించితే, మేము ఒకడుగుముందువేసి, తాత్కాలిక ఏర్పాట్లు చేయడానికి సిద్ధంగా వున్నాము."

దీనివల్ల ఏమి తేలుతుంది ? అంతర్జా తీయంగాను, భారతదేశంలోను జరిగిన ఆందో ళనవల్ల, రాజకీయ, ఆర్థిక ఒత్తిడివల్ల దొరలు దిగివచ్చారు. కాని వాళ్ళు అనేక జాగ్రత్తలు తీసికున్నారు. ముఖ్యంగా భారతీయుల అనై క్యతపై ఆధారపడి వేవెలు ప్లానుకు అంగీ కరించారు. ఇది చర్చిల్ - అమెరీల మన స్తత్వం తెలిసిన వారందరికీ బోధపడుతుంది. సామ్రాజ్యవాదులు భారతీయుల అనైక్యతపై ఆధారపడి జూదమాడారు. మానవాభ్యుద యం కోరేవారు మాత్రం భారతీయులు ఐక్య మవుతారని ఆశించారు. (మిగతా 4వ పేజీలో)

చర్చిల్ తాండవం



— "అమృతబజార్ పత్రిక"నుండి

కాంగ్రెస్ పొరపాటు

(3 వ పేజీ తరువాయి)

సమావేశం మొదట్లోనే వేవెల్ ప్రభువు మృదువుగా మాట్లాడి భారత నాయకులను, ప్రజాభిప్రాయాన్ని తనకు అనుకూలంగా చేసికొన్నాడు. రెండో దశలో ఒడంబడిక అందరిచేత తప్పనిసరిగా అంగీకరింపబడా లని తెల్పాడు. తాను అందుకు సాయపడుతా నన్నాడు.

వేవెలు తానొక లిస్టుతయారుచేసి జిన్నాకు చూపాడు. దానిలో యూనియనిస్టు పార్టీకి చెందిన ముస్లిమ్ ఒకడున్నందున జిన్నా దానిని నిరాకరించాడు కాని యీ లిస్టును వేవెలు కాంగ్రెసు అధ్యక్షునికి చూపలేదు. ఈ విషయమై హిందూ విలేఖరి యిలా వ్రాశాడు :

"ప్రత్యామ్నాయంగా మరోలిస్టు వుందని చెప్పడం మినహా, వైస్రాయి కాంగ్రెసు అధ్యక్షునికి లిస్టు చూపలేదు. ఏమంటే, మౌలానా అజాద్ దానిని నిరాకరించుతాడని వేవెలుకు తెలుసు" (జులై 14 "హిందూ")

పైగా ఆఖరిసమావేశంలో వేవెలు "ఏపార్టీ కోర్కెలను పూర్తిగా అంగీకరించడానికి నాకు సాధ్యపడలేదు" అని చెప్పాడు.

మరికొందరు విలేఖరులు యింకో విషయం కూడా తెల్పారు. వైస్రాయి లిస్టులో కాంగ్రెసు ముస్లింలు లేరు. కాంగ్రెసు అధ్యక్షునిపేరు కూడ లేదట. నిమ్నజాతుల ప్రతినిధులు వేరుగా వున్నారు. అనగా కాంగ్రెసువా రిచ్చిన లిస్టు అంతా మారిందన్నమాట.

దీనిలోనే వుంది రహస్యమంతా: వైస్రాయి తన లిస్టును కాంగ్రెసు అధ్యక్షునికి చూపితే, అతను దానిని నిరాకరించే ప్రమాదముంది. అపుడు వేవెలు అభాసు పాలవుతాడు. అతని లిస్టును ప్రధాన పార్టీలు రెండూ తోసిచేసినట్లవుతుంది. అందువల్లనే సమావేశంలో వేవెలు తన లిస్టును ప్రకటించలేదు. కాని, జిన్నా అంగీకరించలేదు కాబట్టి సమావేశం విఫలమయిందంటూ ప్రకటించి ముగించాడు.

బ్రిటిషు సామ్రాజ్యవాదులకు నింద ఎవరి మీద పడినా ఒకటే. గాంధీగారు ఒడంబడికకు వ్యతిరేకమని 1942 లో నిందవేశారు., 1945 లో జిన్నాపై నిందవేశారు. వాస్తవంలో నిందను ఒకరిమీదనుంచి మరొకరిమీదకు మార్చడం సామ్రాజ్యవాదులకు లాభం: 1942 లో ప్రతిష్టంభనను తొలగించడానికి కాంగ్రెసు అడ్డుపడింది: 1945 లో లీగు అడ్డుపడింది: భారత నాయకులతో రాజీ అసాధ్యమని యిది రుజువుచేయడం లేదా? 1942 లో వేసిన నింద 1945 కు మాసిపోయింది: 1945 లో వేసిన నింద మాయడానికి మరి కొంతకాలం పడుతుంది కాబోలు:

ఈలోగా బ్రిటిషు సామ్రాజ్యవాదులు తమ పేరుకి కళంకంలేకుండా స్వేచ్ఛగా వుండగలరు. ఏమంటే, భారత రాజకీయ పార్టీలు అన్నీ వేవెలు ప్లానును అంగీకరించాయిగా: కాని అయితే వాళ్లు ఎవరెవరు ప్రభుత్వంలో వుండాలనే విషయంలో ఒడంబడిక చేసుకోలేకపోయారు. ప్లాను ప్రతిపాదకుడు, సమావేశ నాయకుడు, అయిన వైస్రాయి తన శాయశక్తులా ప్రయత్నించాడు. కాని దురదృష్టవశాత్తు విఫలుడయ్యాడు అంటూ సామ్రాజ్యవాదులు సిమ్లాసభను గురించి ప్రచారం చేసుకుంటారు. అధికారం వదలుకోడానికి బ్రిటనుకు అయిష్టతలేదు; అధికారం పంచుకోడానికి భారతీయులమధ్య ఐక్యత లేకపోవడమే భారత సమస్యా పరిష్కారానికి ఆటంకంగా వుందంటూ దబ్బా వాయించుకోడానికి ఇప్పుడుమంచి అవకాశం దొరికింది.

వేవెలు ఎత్తు

కథ యింతటితోనేపూర్తికాలేదు. 1942లో సోషలిస్టు క్రిప్సు భారతదేశ పార్టీలపై నింద వేశాడు. 1945లో టోరీ వైస్రాయి మహాత్ముని ముసుగు ధరించి, బాధ్యతఅంతా తనపై వేసుకున్నాడు. కారణం ఏమిటి? బ్రిటిషు ఎన్నికలకు సంబంధించినంతవరకు టోరీల నాటకం అంతమయింది. కాని టోరీలు ప్రభుత్వంలోకి రాకపోవచ్చు. రాబోయే కార్మిక సంయుక్తప్రభుత్వం యింకో ప్రయత్నంచేయమని కోరవచ్చు. అందుచే ఏభారత పార్టీనైనా నిందించడం ఎందుకు? అందులోనూ బ్రిటనులోను, ప్రపంచమంతటా పేరున్న కాంగ్రెసును నిందించడం అనవసరం. బ్రిటిషు ఎన్నికల ఫలితాలు తెలిశాక సిమ్లా సమావేశానంతరం ఏమిచెయ్యాలో నిర్ణయించుకోవచ్చు—అని వేచివున్నారు.

ఈ సందర్భంలో మనమొకసత్యాన్ని గ్రహించాలి. మన ముఖ్యనాయకులనే బ్రిటిషు సామ్రాజ్యవాదులు బోల్తా కొట్టించారు. మన నాయకులీసంగతి గమనించుటలేదు. ఒండొరులపై నేరాలు మోపుకొంటున్నారు. వైస్రాయి తమకు సాయపడి, రెండోపక్షాన్ని త్రోసిపుచ్చలేదని మాత్రమే వారు విచారపడుతున్నారు.

సమావేశంలో రెండు ముఖ్యపార్టీల నాయకులూ ఏమిచేశారో చూదాం. వారి అంచనాలు ఏమిటో చర్చించుదాం. తమ తమ ప్రధానసూత్రాలకు భంగం కలిగితే సహించరనే వాదన ఎంతనిజమో చూదాం.

కాంగ్రెసు పొరపాటు అంచనా

వేవెలు రాజీపట్ల పట్టుదలగావున్నాడని, తప్పకుండా రాజీ జరుగుతుందని కాంగ్రెసు నాయకులు అనుకున్నారు. 1942 లో క్రిప్సు ప్రతిపాదనల వెనకాల సామ్రాజ్యవాదుల కుట్రనే చూచారు; ప్రజాఒత్తిడిని అప్పుడు గ్రహించలేదు. 1945 లో వారు ప్రజా ఒత్తిడినే చూస్తున్నారు; వేవెలు ప్లానులోవున్న సామ్రాజ్యవాదుల ఎత్తును గ్రహించలేదు. ఈ రెండు విషయాలను గ్రహించితేగాని, మనకు వాస్తవికచిత్రం బోధపడదు. వారు బ్రిటిషువారి ఎత్తులలోపడి, వేవెలు నిజాయితీని గురించి పొగడసాగారు. ప్రతివారు తమకు కావలసినది వేవెలు చేసిపెడతాడని అతనివైపు ఎదురుచూశారు. కాంగ్రెసు నాయకులకు, లీగు నాయకులకుకూడ వాస్తవికదృష్టి లేకపోయింది.

ఉదాహరణకు, సిమ్లాసమావేశం కొత్త ప్రభుత్వాన్ని ఏర్పరచకుండా భగ్నమయితే, కాంగ్రెసు ఏమిచేస్తుంది? అని నెహ్రూను ఒకరు ప్రశ్నించారు. దానికి జవాబుగా నెహ్రూ, అలాంటి ప్రశ్నలకు తాను సమాధానమివ్వలేనన్నాడు. ఏమంటే, అలా విఫలమవడం అసంభవమన్నాడు. (అసోసియేటెడ్ ప్రెస్ జులై 11)

జులై 14 వ తేదీన మౌలానా అజాదు పత్రికా విలేఖరుల సమావేశాన్ని ప్రారంభించుతూ తుట్టతుదకు ఒడంబడిక తప్పక జరుగుతుందన్నాడు. "ఇది తన అభిప్రాయమే గాక కాంగ్రెసుదే"నన్నాడు. వేవెలు నిజాయితీ మనిషి అనే భ్రమ యింకా పోలేదు. లేబరుపార్టీ విజయంకోసం ఎదురుచూస్తున్నారు.

కాంగ్రెసు రాజీ కోరుతూంది; బ్రిటను కూడా అందుకే తాపత్రయ పడుతూంది; అలాంటపుడు ముస్లింలీగుతో తాత్కాలికంగానైనా ఎందుకు ఒడంబడిక చేసికోవాలి? అనే దృక్పథం కాంగ్రెసు పెద్దలలో నాటుకుపోయింది. తమది జాతీయసంస్థ; లీగువంటి మతసంస్థతో ఒడంబడిక చేసికుంటే, తమ సూత్రాలకే భంగమని కూడ వారు వాదించుతున్నారు. ఈ ఆలోచనే తాముబ్రిటిషువారితో ప్రత్యేకంగా రాజీపడాలనే పంథాకు కాంగ్రెస్ వారిని తీసుకుపోయింది. ఇందువల్లనే లీగు నాయకులు అలాంటి రాజీ జరుగుతుందని భయపడసాగారు. ఈసందడిలో సామ్రాజ్యవాదులు చల్లగా తప్పుకున్నారు.

"హిందూ" పత్రిక జులై 14 వ తేదీన యిలా వ్రాసింది: "కాంగ్రెసు మొదటినుంచీ నిర్మాణాత్మకంగా సహకారం చెయ్యాలనే దృక్పథం తీసుకుందని కాంగ్రెసు అధ్యక్షుడు వైస్రాయికి తెలియజేశాడు. ఇతర పార్టీల దృక్పథంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ నిర్వహణలో బాధ్యతతీసుకుంటామని తెలియజేశాడు "

పండిట్ నెహ్రూ జులై 11 తేదీన ఇలా చెప్పాడు: "కాంగ్రెసు వేవెలు ప్లానును అంగీకరించింది. ముస్లింలీగు చేరకపోయినప్పటికీ, కొత్త తాత్కాలిక ప్రభుత్వంలో కాంగ్రెసు చేరడానికి సిద్ధంగావుంది. కాని, లీగు కోసం ద్వారం తెరచివుంచాలని కాంగ్రెసు కోరుతూంది."

ఇలాచేయడం ఎంతో ఉదారంగా ఉన్నట్లు భావించుతూ కాంగ్రెసు నాయకులు గుడ్డెద్దు చేలోబడ్డట్లు ప్రవర్తించారు.

భారతదేశ చరిత్రనుండి వారు పాఠాలను నేర్చుకో నిరాకరించారు. ఒక వైపున సామ్రాజ్యవాదులే మన ప్రజలలో చీలికలు పెడుతున్నారని కాంగ్రెసు చెబుతోంది. కాని సిమ్లాలో ఆ ఎత్తు సరిగ్గా ఎలా ప్రయోగించబడుతూందో చూడలేకపోయింది. ఐక్యమయి విజయం సాధించడానికి కృషి చేయలేకపోయింది.

రాజీకొరకు ఆతురతకొద్దీ కాంగ్రెసు నాయకులు వేవెలు, అమెరీల ప్రకటనలలో స్పష్టంగావున్న మాటలను మరచారు.

కాంగ్రెసు జాతీయసంస్థ అను మాట నిజమే. కాని అది వివిధ జాతీయశక్తులను ఐక్యపరచడమనే ప్రధాన కర్తవ్యాన్ని పూర్తిగా వదలివేసింది.

ముఖ్యమైనజాతీయసంస్థ తన కర్తవ్యాన్ని నెరవేర్చకపోతే, భారతదేశం జాతీయవాంఛను యెలా సాధించగలుగుతుంది? అందుచేతనే సిమ్లాసమావేశం నొసట అపజయం వ్రాసిపెట్టివుంది.

కాంగ్రెసు నాయకుల అంచనాలన్నీ పూర్తిగా విఫలమయ్యాయి. ఇంక సహజంగా వారు లీగును నిందించసాగారు. మౌలానా అజాద్ పత్రికా విలేఖరులతో చేసిన సంభాషణలో, "ముస్లింలీగు దృక్పథమే సమావేశం భగ్నమవడానికి కారణం" అని చెప్పాడు. సోదర పార్టీలతో కలసి ఒకే పంక్తిలో నిలబడక, రాజీకిసామ్రాజ్యవాదులవైపుచూచారు. దీని ఫలితమే సోదరులను నిందించడం, అందరినీ బానిసత్వంలో వుంచిన యజమానిని పొగడడం, లోకి దిగజారింది.

కాని, కాంగ్రెసు నాయకులు తమ దృక్పథం సరియైనదని ఎందుకు భావిస్తున్నారో చూదాం. జులై 14 వతేదీని మౌలానాఅజాద్ పత్రికా విలేఖరుల సమావేశంలో యిలా చెప్పారు :

"కాంగ్రెసు జాతీయసంస్థ. అందువల్ల అది తన జాతీయతకు విరుద్ధమైన యే పరిష్కార పద్ధతికి – అది తాత్కాలికమైనదే అయినా – అంగీకరించడం సాధ్యంకాదు. జాతీయ వికాసానికి అది ఆటంకం కలిగించేటట్లున్నా, ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని కాంగ్రెసు ఒక మతసంస్థగా మారిపోయేగతి పట్టినా, అట్టి విధానాన్ని కాంగ్రెసు వ్యతిరేకిస్తుంది."

అయితే, యీ "జాతీయ సిద్ధాంతం" అమల్లోకి రావడం ఎలా? బ్రిటిష్ వైస్రాయి చేత అంగీకరింప జేయడంద్వారానా? అజాద్ గారే అన్నమాటలు చూడండి :

"ముందుకి నడవడమో, నడవకపోవడమో, నిర్ణయించుకోవలసింది వేవెల్ప్రభువు. దేశంలో ఏర్పడ్డ మతసమస్యకు బాధ్యత బ్రిటిష్ ప్రభుత్వానిదేతప్ప మరెవరిదీకాదు. ....ప్రభుత్వం యీవేళకాకపోతే రేపైనా న్యాయమైన పునాదిపై గట్టిగా నిలబడవలసి యుంటుంది."

ఈ వైఖరికి, బూజుపట్టిన మితవాద వైఖరికి భేదం ఏమైనావుందా? మన అంతరంగిక సమస్యలను మనమే స్వయంగా పరిష్కరించుకోవడం కాంగ్రెసు సాంప్రదాయం కాదా? బ్రిటిష్ పాలకవర్గం మనలో మనకు యెన్ని చీలికలు పెట్టినా, ఐక్యతవల్ల ప్రభుత్వ పన్నాగాన్ని ఓడించడానికి పనిచేయడమే గదా కాంగ్రెసు లక్ష్యం?

జాతీయతకు విరుద్ధం

కాని, మౌలానా అజాద్ ప్రకటించిన అభిప్రాయాలు వేవెల్‌సహాయంతో జిన్నాను లొంగదీయ ప్రయత్నించడానికి దారితీస్తాయి. ఇది జాతీయతకు విరుద్ధమైన ఎత్తుగడకాదా? "తటపటాయించడం మంచి మార్గంకాదు; బలహీనులలక్షణం" అంటూ అజాద్ వైస్రాయిని హెచ్చరించాడు. "....ఏ ఒక పార్టీగాని, సంఘంగాని, ఆటంకాలు పెట్టదలిస్తే ప్రభుత్వం లొంగిపోకూడదు" అని కూడా ప్రకటించాడు.

ఒక బ్రిటిష్ వైస్రాయి సహాయంతో భారత జాతీయతకు విజయమెలా చేకూరుతుందో? చివరకు వేవెల్ ప్రభువు చేసిందేమిటి? ముస్లిం సభ్యుల జాబితాలో ప్రభుత్వ గులాముగావున్న యూనియనిస్టు ముస్లింని ఒకడిని పెట్టాడు. అంతే. ముస్లింలీగ్ కోర్కెను (ముస్లిం సభ్యులందరినీ లీగ్ మాత్రమే సూచించాలనేది) కాంగ్రెసు వ్యతిరేకించడంవల్ల వైస్రాయికి ఇలా అవకాశం దొరికింది. అటు లీగ్, కాంగ్రెసు ముస్లింలెవరూ కార్యనిర్వాహకవర్గంలో ఉండరాదని పట్టుపట్టడంవల్ల కూడా వైస్రాయి ధైర్యంగా తనతొత్తునిజాబితాలోచేర్చగలిగాడు: మౌలానా అజాద్, తన పాలసీని యెంతవరకు సరియైనదో తెలుసుకోవాలంటే, దాని ఫలితాలను జాగ్రత్తగా పరిశీలించాలి. చివరకు జరిగినదేమిటి? ముస్లింలీగ్‌ని కాంగ్రెసు దూరం చేసుకుంది. కాంగ్రెసు ముస్లిం లెవరూ లేకుండా చేసుకుంది. వేవెల్ పన్నిన వలలో చిక్కుకుంది. (మిగతా 9 వ పేజీలో)

నూతన పోలెండులో ప్రజాస్వామ్య స్థాపన

డాక్టర్ హ్యూలెట్ జాన్సన్

డాక్టరు హ్యూలెట్ జాన్సన్ వయస్సు 71 సంవత్సరాలు, ఇంగ్లండులో క్యాంటర్బరీ పీఠానికి "డీన్" (ఒకచిన్న పీఠాధిపతి). ఈయన అనేక పత్రికలలో వ్యాసాలు, సంపాదకీయ వ్యాఖ్యలు, రాస్తాడు. బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ పత్రిక "డెయిలీ వర్కర్" సంపాదకవర్గంలో సభ్యుడు. డాక్టరు జాన్సన్ రచించిన "ప్రపంచంలో ఆరవ భాగమగు సోషలిస్టు ప్రపంచం" అమెరికాలో 2½ లక్షల ప్రతులు అమ్ముడుపోయాయి. అది చాలా భాషలలోకి అనువదింపబడింది. ఈ క్రింది వ్యాసాన్ని ఆయన "హిందూ" పత్రికకు (మద్రాసు) ప్రత్యేకంగా రాసి పంపించారు. పోలెండులో యీయన స్వయంగా సంచారంచేసి తెలుసుకున్న విషయాలు ఇచ్చట యిస్తున్నాం.

★

పోలెండులో జర్మన్ల హత్యాకాండను గురించి విచారణ జరపడానికి నియమింపబడిన ఉపసంఘంవారు నన్నక్కడికి ఆహ్వానించారు. నేటి పోలెండులో యదార్థ పరిస్థితులెలావున్నాయో తెలుసుకోడానికి మే 28 వ తేదీని నేను విమానంలో బయల్దేరాను. వార్సా, క్రాకో మొదలైన స్థలాలకు మేం వెళ్ళాం. అనేక తరహాల వ్యక్తులతో మాట్లాడాం. మంత్రులతోను, మతాధిపతులతోను, కళావేత్తలతోను, గ్రంథ రచయితలతోను, రైతులతోను, గెరిల్లాయోధులతోను-సంభాషణలు జరిపాం. అధికార, అనధికార వర్గాలకు చెందిన ప్రముఖుల్ని కలుసుకున్నాం.

పోలెండులో ఎర్రసైనికులు చాల కాలం నుంచి ఉన్నారు. సోవియట్‌యూనియన్‌పట్ల పోలిష్ ప్రభుత్వం చక్కని విధానం అవలంబిస్తూన్నట్లు నేను తెలుసుకున్నాను. రెండు దేశాలమధ్య స్నేహభావమనే గట్టిపునాదిమీద పోలిష్ విదేశాంగనీతి ఆధారపడివుంది. ఇది నాకెంతో సంతోషం కలిగించింది. అలాంటి స్నేహసంబంధం ఎంతో అవసరమూ, సహజం కూడాను. రష్యావారి ఎర్రసైన్యం పాసిస్టు హంతకుల్ని పారద్రోలి, పోలెండ్ దేశాన్ని కాపాడింది. ప్రస్తుత ఆర్థిక పునర్నిర్మాణ కార్యక్రమంలో పోలెండుకి రష్యా చేయూతనిస్తోంది. రష్యన్ ఇంజనీర్లు విస్తులా నది మీద అనేక వంతెనలుకడుతున్నారు. రష్యన్ సైనికులు పంటభూములలో నాట్లువేస్తున్నారు. రష్యన్ టెక్నీషియన్లు టెలిఫోనులు వగయిరాలకు మరమ్మతు చేస్తున్నారు. అందువల్ల కొత్త పోలిష్ ప్రభుత్వంయొక్క విదేశాంగనీతి రష్యా-పోలిష్ స్నేహ సంబంధం మీద ఆధారపడి యుండడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అది సహజం, తప్పనిసరి. "పోలిష్ ప్రజలు స్లెవోనిక్‌జాతివారు. అందువల్ల రష్యా పోలెండుకు స్వతస్సిద్ధమైన మిత్రదేశం" అని పోలిష్ ప్రెసిడెంటు నాతో అన్నాడు. నా అనుభవం, అభిప్రాయం, కూడా ఇదే.

ప్రజల జాతీయ వాంఛలు

రెండో విషయం ఏమంటే - పోలెండులో నేడు జాతీయ భావాలుతీవ్రంగా వ్యాపించి ఉన్నాయి. పోలెండు వ్యవహారాలలో అన్యదేశీయుల కెలాంటి పెత్తనం లేకుండా, పోలిష్ ప్రజల యిష్టానుసారం, స్వేచ్ఛగా పరిపాలన సాగాలని ప్రజలంతా గాఢంగా వాంఛిస్తున్నారు. పోలెండులో మేము కలుసుకున్న ప్రతి వ్యక్తిలోను యీ జాతీయవాంఛ ద్యోతకమయింది. వార్సా నగరంలో గోడల మీద ఎక్కడ చూచినా, యిలాంటి భావాలతో కూడిన కాగితాలే కనపడ్డాయి. మేము చూచిన ప్రతిపల్లెలోను, ప్రతి పట్టణంలోను, అనేకులు యిట్టి జాతీయభావాలు వెల్లడించారు. సోవియట్ ప్రభుత్వం కూడా - మాటల్లోనే కాకుండా చేతల్లో-యిదే కోరుతూంది. పోలిష్ ప్రజల జాతీయ జీవనాన్ని అదుపు ఆజ్ఞల్లో ఉంచడం సోవియట్ ఆశయం కాదు. నేనొకనాడు డాన్జిగ్ పట్టణ గవర్నరుతో మాట్లాడుతున్నాను. పోలెండుకు సోవియట్ ప్రభుత్వం చేసిన, చేస్తున్న సహాయానికి పోలిష్ ప్రజలు ఎంతైనా కృతజ్ఞులని ఆయన తెలియజేశాడు. అయితే, పోలెండ్ తన కాళ్లమీద తాను నిలబడుతూ, తన బాధ్యతను తాను పూర్తిగా నెరవేర్చాలని పదే పదే సోవియట్ ప్రభుత్వం హెచ్చరిస్తూన్నట్లు ఆయనచెప్పారు. "పోలెండ్ మీది; దాన్ని పరిపాలించుకోవలసిన వారు మీరు" అంటూ ఒక రెడార్మీజనరల్ తనతోపలికిన పలుకులు డాన్జిగ్ గవర్నరు నాతో చెప్పాడు........

కొత్త పోలిష్ ప్రభుత్వాన్ని ఎదుర్కొంటూన్న సమస్యలు సాధారణమైనవికావు; అతి క్లిష్టమైనవి. ఎంతో ధైర్యం గల ప్రజలు తప్ప మిగతా వారెవరూ వాటిని పరిష్కరించలేరు. అయితే, పోలిష్ ప్రజలు, పోలిష్ ప్రభుత్వం ధైర్యంతోనే వాటిని పరిష్కరిస్తున్నారు.

పోలిష్ అధికారవర్గానికి చెందిన వారంతా యుద్ధానుభవంలో నిగ్గుతేరారు. అనేక కష్ట పరిస్థితుల నెదుర్కొన్నారు. కాబట్టి, ముందు రాబోయే క్లిష్టసమస్యలవల్ల కూడా వారు గాబరాపడరు. అన్నిటికంటె ప్రధానమైన సమస్య ఏమంటే, పరిపాలనా యంత్రాన్ని పైనుంచికిందవరకూ నడపవలసిన నిపుణులు పోలెండులో తక్కువ. యిన్నాటివరకూ అది కారపడవుల్లో ఉన్న పాతతొత్తుల్ని తొలగించడంవల్ల వారిస్థానే కొత్తవారు సక్రమ మార్గములో ప్రభుత్వ శాసనాలను అమలుపరచవలసియుంది. అయినా, వీరు నైపుణ్యంతో తమకర్తవ్యాన్ని నెరవేర్చగలరను నమ్మకం నాకు ఉంది. పోలిష్ దేశభక్తులు గెరిల్లా దళాలలో చేరి, ఎలా తమ చాకచక్యాన్ని ప్రదర్శించారో, వార్సా నగరాన్ని ఎంతనేర్పరితనంగా రక్షించుకున్నారో, అలాగే యిప్పుడుకూడా పరిపాలనాయంత్రాన్ని నడపడానికి ఉద్యుక్తులౌతున్నారు.

రోజురోజుకి పోలిష్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ, బలపడుతోంది. సుస్థిరంగా పరిపాలనా యంత్రాన్ని నడుపుతోంది. ఇప్పటికే అనేక గొప్ప విజయాలు సాధించింది.... వ్యవసాయంలో చక్కని సంస్కరణలు తీసుకొచ్చింది. వాటిని యిక ఎవరూ రద్దుచేయజాలరు.

వ్యవసాయ విధానంలో సంస్కరణలు

మేము పోలెండులో ఉత్తరాన, దక్షిణాన, తూర్పున, పడమట - అనేక ప్రాంతాలకు వెళ్ళాం. విమానంమీద కిందబారుగా ప్రయాణంచేసి, పంట భూములను పరిశీలించాం. మోటారుమీద పల్లెటూళ్లకువెళ్ళి చూచాం. ఎక్కడికి వెళ్ళినా, రైతులు అతి జాగ్రత్తగాను, శ్రద్ధతోను, కొత్తభూములను సాగుచేస్తున్నారు. కొత్తగా తిరిగి కడుతూన్న ధాన్యపుగాదులు, షెడ్లు - ఎన్నో మాకు కనపడ్డాయి. అడవుల్లో చెట్లను పడగొట్టడం, వాటిని రంపపు మిల్లులలో చెక్కలుగా కోయడం - మేము చూచాం. కొత్త వ్యవసాయ విధానాన్ని పరిశీలించడానికి మేమొక గ్రామంలో ఒక పూట గడిపాం. అంతా విన్నాం. ఒక పెద్ద జమీందారీ ఎస్టేటు ఉండనుకోండి; అందులో యెక్కువ భాగాన్ని రైతులకు పన్నెండేసి యెకరాల చొప్పున పంచిపెడతారు. మిగతాభూమిని కొత్త పరిశోధనాలయాలకు, కొత్త విత్తనాలను తయారుచేయడానికి, ప్రత్యేకించుతారు. పూర్వం జమీందార్లు విలాసంగా కాలం గడిపిన పెద్ద పెద్ద భవనాలన్నీ యిప్పుడు వ్యవసాయ కళాశాలలుగా మారిపోయాయి. అక్కడ యువకులకు వ్యవసాయశాస్త్రంలో విద్య నేర్పుతున్నారు.

కొత్త శాసనం ప్రకారం ఇలాంటి కళాశాలల్లో కొన్ని పరీక్షలు ప్యాసైనవారికి తప్ప మరెవరికీ భూములు సంక్రమించవు. వారు తమ భూములపై వ్యవసాయంచేసి పంటలు పండించగల నేర్పుగలిగి ఉండాలి. దీనిఅర్థం, పోలెండులో ఇకమీదట చక్కని తెలివితేటలతో వ్యవసాయం కొనసాగుతుందన్నమాట.

రైతుల్లో స్వయం సహాయం, అన్యోన్య సహకారం బాగావ్యాపిస్తున్నాయి. మేం వెళ్ళిన ప్రతిగ్రామంలోను మతాధిపతులు గ్రామ పరిపాలనలో స్వయంగా పాల్గొని ప్రజలకు సేవ చేస్తున్నారు: వ్యవసాయంలో సంస్కరణలు రావడం వీరిక్కూడా ఇష్టంగానేవుంది. ఉదాహరణకు, ఫాదర్ బొరోవిసీ అను మతాధిపతి ఇప్పుడు జెక్‌జో జిల్లాబోర్డుకి అధ్యక్షులుగా వున్నాడు. ఈయన యుద్ధానికిపూర్వం పోలిష్ రైతాంగపార్టీలో ప్రముఖపాత్ర వహించేవాడు. యుద్ధకాలంలో ఈయనకు పోలిష్ ప్రజల రహస్యోద్యమంతో సంబంధం వుండేది. జర్మన్లు పోలెండు విడిచి పారిపోగానే, బహిరంగంగా వచ్చాడు. జమీందార్ల భూముల్ని పంచుకోవలసిన సమయం ఆసన్నమైనపుడు, అంతా న్యాయంగా పంచుకోమని ఈయన రైతులకు సలహా యిచ్చాడు. కొత్తగా అమల్లోకివచ్చిన యీ సంస్కరణలు జమీందార్లకు వ్యక్తిగతంగా బాధ కలిగించినమాట వాస్తవమే; కాని అది తప్పదు. ఈ బాధను తగ్గించడానికి మాత్రం కొన్ని నిబంధనలు ప్రవేశపెట్ట బడ్డాయి. కాని చాలా మంది జమీందార్లు దేశం విడిచిపెట్టి పారిపోవడంవల్ల యీ సమస్య సులభమైంది. అలా పారిపోకుండా మిగిలివున్న వారిలో ఎక్కువమంది కొత్తసంస్కరణలను, వాటికి కారకులైన పాలకవర్గాన్ని వ్యతిరేకించ వచ్చు. కాని, ఒక్క విషయం మాత్రం నిజం: ముందు ఏర్పడబోయే ఏప్రభుత్వమూ యీభూముల్ని, లాక్కొని తిరిగిజమీందార్లకు ఇవ్వడం సాధ్యపడదు. ఇది కొత్త పోలెండు యొక్క ప్రధాన లక్షణం.

"దేవస్థానం భూముల సంగతేమిటి?" అని నేను న్యాయశాఖమంత్రిని ప్రశ్నించాను. ఆయన యిలా చెప్పాడు : "ఒక్క అంగుళం భూమిని కూడా మేము ముట్టుకోలేదు. త్వరలో పంచాయితీ ఎన్నికలు వస్తాయి. ప్రజలంతా స్వేచ్ఛగా, సమాన హోదాతో, రహస్యపద్ధతిని వోట్లు యిచ్చి, పెద్దలను ఎన్నుకుంటారు. అలా ఎన్నుకోబడిన పంచాయితీలు దేవస్థానపు భూముల విషయంలో ఎలాచేస్తే మంచిదని నిర్ణయిస్తాయో, అలా అమలుజరుగుతుంది."

మత స్వాతంత్ర్యం

నూతన పోలెండులో మతస్వాతంత్ర్యం ఎలాఉందో తెలుసుకుందామని నేను చాలా మందితో మాట్లాడాను. త్వరలో ప్రభుత్వం పోలిష్‌ప్రజల మతస్వాతంత్ర్యాన్ని గ్యారంటీ చేస్తూ ఒక శాసనం ప్రవేశపెట్టబోతూంది. వార్సా, క్రాకో, డాన్జిగ్ పట్టణాలలో నేను అనేక ప్రార్థనలకు వెళ్ళి పాల్గొన్నాను. మెథడిస్టులతోను, బాప్టిస్టులతోను, లూథరన్లతోను, కాల్వినిస్టులతోను, నేను స్నేహం సంపాదించాను. వారివారి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నాను. పూర్వం పోలెండులో యిలా ఉండేది కాదు. ఒక్క రోమన్ క్యాథలిక్కులకు మాత్రమే మత స్వాతంత్ర్యం ఉండేది. ఇప్పుడందరికీ ఉంది.

ప్రజలకు తగినంత ఆహారం, నివసించడానికియిల్లు కట్టుకోవడానికి బట్ట - తయారుచేయడమే ప్రస్తుతము నూతన ప్రభుత్వం యొక్క ప్రధాన కర్తవ్యంగావుంది. ఇదియేమంత సులభమైన పనికాదు. కాని, డాక్టర్ పీటర్ బ్రికిమ్ నాతో ఇలా అన్నాడు.: "ఉన్నంతలోనే మేం సమానంగా పంచుకోడానికి ప్రయత్నిస్తున్నాం."ఇందువల్లనే కాటోవిస్, పీటర్స్‌బర్గ్లోను, సందుల్లోను చూచిన ప్రజలు ముఖ్యంగా యువకులు, బాలబాలికలు- మంచి ఆరోగ్యంగా కనిపించారు; వారి దుస్తులు నేమంత పాడుగాలేవు.

జర్మన్లు పోలెండులో 100 కి 80 పందులను, సంపదను చంపివేయడమో, లేక జర్మనీకి రవానాచేయడమో, చేశారు. అందువల్ల వ్యవసాయం బాగా దెబ్బతింది. మళ్ళా నాగేళ్ళవరకు ఈ నష్టం భర్తీకాదు. మాంసం చాలారోజుల వరకు పుష్కలంగా దొరకదు, ప్రస్తుతం పందులను విరివిగాపెంచుతున్నారు. కొద్దిరోజులకుయివి పెద్దవై పంది మాంసం మార్కెట్లలో అమ్మబడుతుంది.

ఆర్థిక నిర్మాణం

పోలెండులో వ్యక్తులు స్వేచ్ఛగా వ్యాపారము చేసుకోవచ్చు. పరిశ్రమలు పెరుగుతో వచ్చు. అయితే, దూరదృష్టితో ప్రభుత్వం కొన్ని హద్దులు పెట్టింది. గుడ్డిగా యేవిధమైన్నీ పోలెండు అమల (మిగతా 8వ పేజీలో)

కంచు కాగడా

1944 డిసెంబరులో భీమవరం తాలూకా లోని కాంగ్రెసువాదులు సమావేశమయ్యారు. నిర్మాణకార్యక్రమం కొనసాగించడానికి 40 మంది సభ్యులతో తాలూకా కాంగ్రెసు అసెంబ్లీని ఏర్పరిచారు. భూపతిరాజు సోమరాజు గారిని అధ్యక్షులుగాఎన్నుకొన్నారు. కాంగ్రెస్ వాదులు - కమ్యూనిస్టులు అంతాకలసి ప్రజా సేవ చేయ పూనుకున్నారు.

కాని అయ్యదేవరవారి చల్లని చూపుకు యిది గిట్టలేదు. తమ బంటు దావీదుగారిని ప్రయోగించారు. వారు వేంచేసి గూకుపుతానీ జరిపారు. కాంగ్రెసు అసెంబ్లీ సభ్యులకు నోటీసులనైనా పంపలేదు. కనీసం అధ్యక్షులనైనా పిలవలేదు. 8 మంది శిష్యులను చేర్చారు. కోరమ్ లేకుండానే సమావేశంజరిపి కమ్యూనిస్టులను తొలగించివేస్తూ తీర్మానం చేశారు. కాశేశ్వరరావుగారి ఉపనిషత్ రాజ్యములో ధర్మం మూగజంతువై నాల్గుపాదాల మీద నడుస్తున్నదనడానికి యిదే చిహ్నం కాబోలు!

ఆ వరసలోనే తాలూకా అసెంబ్లీ నాయకుడుగా శ్రీ గోకరాజు శ్రీరామరాజుగారు పట్టాభిషిక్తులయ్యారు. వీరెవరు? వ్యక్తిగత సత్యాగ్రహం రోజుల్లో ఫొటో తీయించుకొని, పోలీసులకు లంచమిచ్చి అరెస్టు చేయించుకొన్నవారు. అదే వారి రాజకీయ జీవితానికి మొదలు. ఆరంభంలోనే హంసపాదు ఉందనుకోండి. అంతకు పూర్వజీవితం వ్రాస్తే యీ కలం కలుషితమవుతుంది కాబట్టి, వ్రాయను.

నక్కపుట్టి నాలుగురోజులు కాలేదు, "ఇంత పెద్దగాలివాన ఎప్పుడూ చూడలేదని" విస్తుపోయిందట. అలా గే యీ ప్రబుద్ధుడు తాలూకా ప్రజల నాయకులుగాచూసే భూపతి రాజు రామమూర్తిరాజు, నిడ్దాపురం సోమరాజు, దంతులూరి రామరాజు, నారాయణ రాజుగార్లవంటి పెద్దలనుదూషించడం ప్రారంభించాడు. కారణం ఏమిటి? వీరు తాలూకా లోని దేశభక్తులు. కాంగ్రెసువాదులు, కమ్యూనిస్టులు - అంతాకలసి పని చేయాలనడమే వీరి దోషం.

★

మే నెలలో కొల్లేరు రైతు మహాసభ ఆకివీడులో జరిగింది. తాలూకా అసెంబ్లీ అధ్యక్షులైన సోమరాజుగారు ఆహ్వానసంఘాధ్యక్షులుగా పనిచేశారు. 20 గ్రామాలనుంచి కొల్లేరు ముంపువల్ల బాధపడే రైతులు వచ్చారు. కాంగ్రెసువారు, కమ్యూనిస్టులు కలసి పనిచేసి సభను జయప్రదంగా జరిపారు. రైతులు ముంపువల్ల పొందే నష్టాలను తెలిపి, ప్రభుత్వం సౌకర్యాలు కలిగించాలని తీర్మానించారు.

కాశేశ్వరరావు శిష్యులకు యిదీ కిట్టలేదు. ఈ సభనుగురించి గోకరాజు శ్రీరామరాజు, "రైతు సభకాదు, కమ్యూనిస్టుల సభ; వెళ్లకండి" అని ప్రచారంచేశారు. కాని ఈ మతిభ్రమ మాటలు ఎవరువింటారు? అది అరణ్య రోదనంగానే వుండిపోయింది.

ఆహ్వాన సంఘాధ్యక్షులైన సోమరాజు గారికి రామరాజు, "కిసాన్ కాంగ్రెసు నాయకులను పిలవండి; లేనిచో సభ జరక్కుండా చేయండి;" అని హుకుం జారీ చేశాడు. సోమరాజుగారు తామొక రైతు. తమవలెనే యిబ్బంది పడుతున్న కొల్లేరు రైతుల సభకు అడ్డుపెట్టడం ఆయనకు నచ్చలేదు. రామరాజాజ్ఞాపత్రం అమలు జరుగలేదు. సభ జరిగిపోయింది.

కొల్లేరు రైతుల సభలో పాల్గొన్నందుకు క్షమాపణ చెప్పాలనీ, లేనిచో డిసిప్లినరీచర్య తీసుకుంటామనీ, శ్రీ గోకరాజువారు బహిష్కరణపత్రిం జారీచేశాడు. దీనినే కాబోలు గుడ్డువచ్చి పిల్లను వెక్కిరించిం దంటారు. దీనికి సోమరాజుగారు చక్కని సమాధానం యిచ్చారు "కొల్లేటి రైతుల కష్టసుఖాలు యింతవరకు మనం చూడలేకపోవడం సిగ్గుచేటు. ఈనాడు కమ్యూనిస్టు సోదరులు ఆపని చేస్తుంటే పాల్గొనకపోవడంగాని, వ్యతిరేక ప్రచారం చేయడంగాని కాంగ్రెసు ఆశయానికి విరుద్ధం. నేను నా విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చాను. క్షమాపణ ఇవ్వనవసరంలేదు" అని చక్కగా బుద్ధిగరపారట.

★

జనాబ్ షేక్ ఆలీ కాంగ్రెసు సేవకుడు. ఆగస్టు అల్లరుల సందర్భంలో రెండు సంవత్సరాలు శిక్ష అనుభవించి వచ్చాడు. జైలు నుంచి విడుదలై వచ్చినపుడు కామ్రేడ్ గొట్టిముక్కల వెంకట్రామరాజు షేక్ ఆలీగార్లకు ఎంకగండి గ్రామంలో ప్రజలు సన్మానం జరిపారు. కమ్యూనిస్టులు, ప్రజలు అంతా దేశభక్తులకిచ్చిన స్వాగతమిది.

కాని ఇది రామరాజుదృష్టిలో ఘోరాపరాధం అయిపోయింది. "కమ్యూనిస్టులు యిచ్చిన స్వాగతం ఎందుకు పుచ్చుకున్నావ్? క్షమాపణ చెప్పుకో" అని షేక్ ఆలీకి తాఖీను పంపించాడు. ఆయన, "దేశంకోసం శిక్ష అనుభవించి వచ్చిన నాలాంటివారికి ప్రజలు, సోదర దేశభక్తులు, స్వాగతమిస్తే స్వీకరించడం ఏమీ అపరాధంకాదు. నేను క్షమాపణ యివ్వనక్కర్లేదు." అని జవాబు చెప్పారు.

★

మహదేవ పట్నం దేశాభిమానం గల గ్రామం. యువకులు ప్రజాసేవకులకు సాయం చేయడం తమ విధిగా ఎంచుతారు. గోకరాజువారు యీ గ్రామం వెళ్లారు. గ్రామస్తులను, "మీరు కమ్యూనిస్టులకు రు. 600 లు యిచ్చారట. ఎందుకిచ్చారు? ఏమిటి?" అని పంచాయిషీ అడిగాడు.

గ్రామపెద్దలు, చిన్నలు కూడ ఇలా అడిగినందుకు చివాట్లు పెట్టారు. "ఎవరు ప్రజాసేవ చేస్తుంటే వారికి సాయం చేస్తాం; అడగటానికి మీరెవరు? ద్వేషంతో గుడ్డివాళ్ళు కాకండి!" అనిచెప్పి సాగనంపారు.

★

కనకపు సింహాసనమున
శునకము కూర్చుండబెట్టి శుభలగ్నమునన్
ఒనరగ పట్టము గట్టిన
వెనుకటి గుణమేలమాను వినరానుమతీ!

అల్పబుద్ధివాని కధికారమిచ్చిన
దొడ్డవారినెల్ల తొలగదోలు
చెప్పు దినెడి కుక్క చెరుకు తీపెరుగునా
విశ్వదాభిరామ వినురవేమ.

పుస్తక పరిచయం

'నయాగరా'

కృతులు: రామదాస్, అంజనేయులు, సుబ్రహ్మణ్యం.

ప్రాప్తిస్థానం: నవ్యకళా పరిషత్తు, పరసారావుపేట. వెల రు. 1-0-0

★

వర్తమానమైనఆదర్శాలను,నయగరావడితో పలకగల సామర్థ్యం వున్నవారు ఈముగ్గురు యువకవులూ. నేటిప్రపంచంలో పరస్పరం సంఘర్షిస్తున్న సమస్యలను అవగాహన చేసుకొని, హృదయంగమంగా చెప్పగలిగేరు ఈ గద్యపదాల్ని. ఇవి "మానవమేధస్సుకు సంకెళ్ళను తగిలించిన గత సాంఘిక శిలాశాసనం పడగొట్టను పగిలిన విస్ఫులింగాలు"వలికిన విప్లవగీతాలు. ఇందు కొన్ని అభ్యుదయ రచయితల పత్రిక 'తెనుగుతల్లి' లో వెలువడ్డాయి. ఈ ముగ్గురు కవులు పీడిత తాడిత ప్రజలకు పరమ మిత్రులు. ధనిక సామ్రాజ్య పానిస్టుతత్వాలకు బద్ధశత్రులు.

వినండి రామదాస్‌గారి 'నా గీతం' — "స్వేచ్ఛామహాగ్ని పర్వత శిఖిరాంచల రక్తజ్వాలికగా మండిందట, సామ్రాజ్యాలు బాచిన నెత్తుటిజాలికలే వరికిందట" — జ్వాలికకున్న వేడికత్తికున్న పదునూ వుందట తనగీతానికి: "శ్రామిక జనపాలంలో ఎండని మర్మజలం చల్లని చేతులతో తుడిచిందట, వర్గరహిత సంఘవ్యర్గానికి పూలవిచ్చెనలు వేసిందట.... మేధస్సుకు రెక్కలు కట్టిందట, జీవితాన్ని విహంగం చేసిందట."

ప్రపంచ సంక్షోభంనుండి ఉద్భవిస్తున్న సత్యాలను వివరించాడు ఈ కవి. ప్రపంచ ప్రజాపోరాటాన్ని చిత్రించాడు. రానున్న విశ్వమానవ కల్యాణాన్ని సూచించాడు.

కాని - "వీరులదే మారేలోకం. వీరులదే బీర్‌బాటిల్!" అని అంటాడొకచోట. స్వేచ్ఛా సౌభాగ్యాలతో రానున్న 'మారే లోకా'న్ని వీరులకు బహూకరిస్తూ, దాంతో బాటు యివ్వడానికి బీర్‌బాటిల్ కంటె మంచి వస్తువేదీ దొరకలేదా కవికి? నవజగత్తును నిర్మించిన వీరులకిచ్చే బహుమానం యింత చవకదారుదా?

"మనం విప్లవం మా చరిత్రలో వీచిన జంఝామిల వీచిక; విదలించిన వీరుని ఖడ్గం, పగపట్టిన పాము బుసా, చూపించిన విప్లవమార్గం, సామ్రాజ్యపు కత్తులవానకు పట్టించిన స్వర్ణచ్ఛత్రం, అధికారపు అన్యాయాలను అడ్డించిన రక్ష కవచం"- ఆంధ్రవీరుడు అల్లూరి సీతారామరాజు ప్రభుత్వాన్ని గడగడ లాడించిన ఘట్టాన్ని వీర రసవత్తరంగా చిత్రించేరు అంజనేయులు గారు. మన్యవిప్లవం. "బంధించిన దాస్యశృంఖల విచ్ఛేదక వీరమూర్తి విప్లవశరదాకాశం వెలిగించిన విద్యుద్దీపం."

తక్కిన యిద్దరు కవుల్లాగనే అంజనేయులుగారు విప్లవశక్తులకు విజయంసిద్ధిస్తుందన్న నమ్మకం గలవారు. "జగత్తులో విప్లవ యజ్ఞం చేయించిన నియంతలారా! కాలానికి కట్టలు కట్టిన కర్కోటక ప్రభువుల్లారా! నాగరికత పేరిట జరిగే నరహత్యలకూ జాతీయోన్నతి మిషతో సాగే పరిపీడనకూ ఉత్తరవాదులు మీరే. ఉరికంబం పిలుస్తోంది. విజయం తెలిసి శిరమెత్తిన ప్రజా విజయ రథసారథి చర చర చర చర నడిచే, శరవేగంతో నడిచే విప్లవసైన్యం జయిస్తుంది." అనీ, "త్యాగానికి త్యాగంనేర్పే యోధుల్లారా! యిరుగుపొరుగు జాతులకొరకై విరామమే యెరుగని పురోగామి సైనికులారా! సకలం తెగించి పోరే సమరం జయించి మీరే నిర్మాతలు - నవ జీవననిర్ణేతలు" అనీ వ్రాశారు. "పున్నమి వెన్నెలలై పొంగిన దానిసనంద్రములో పొర్లిన మబ్బుల తెరటం. సామ్రాజ్యపు చెలియలికట్టను భేదించిన రక్తతరంగం.... 300 ఏండ్లక్రితం నాటుకున్న విషవృక్షం చీకట్లను చిమ్ముతుంటే విరిసిన చంద్రుడు చంద్రసింగ్," "ముస్లిముల చంపమన్న సైనికాధికారుల అజ్ఞలను ధిక్కరించినందుకు" "నల్లకోటు వేసుకున్న తెల్లటిన్యాయం చంద్రసింగ్ చేతికి తగిలించెను సంకెళ్లు!" -యీపీఠువికి సుబ్రహ్మణ్యంగారు అర్పించిన కవితాంజలి "ఠాకూర్ చంద్రసింగ్". ఈస్వాతంత్ర్య సైనికుడు తన సోదర భారతీయుడైనందుకు గర్విస్తున్నాడు కవి. "కంకాలం గింగిల వలలో తన్నుకునే చేపలు కావివి, దానినలం పుట్టుక తోడి సైనికులం" అని మన దాస్యత్వాన్ని స్వాతంత్ర్య పోరాటాన్ని జ్ఞాపకానికి తెస్తున్నాడు. కవిభావన చూడండి. "వీరభూమి భారతావని యుగయుగాల చీకటిలో విలువలేక విలువలేక తెరచిన విప్లవనేత్రం" అట "మా చంద్రసింగ్"!

కాలంతోబాటు ప్రవహిస్తున్నారీ నయాగరా కవులు. ఏటికి యెదురీదడానికి ప్రయత్నించేవారూ, కాలప్రవాహంతో వస్తూ వస్తూ శక్తిలేక మధ్య ఆగిపోయేవారూ, కూర్పుగలవృష్టి యేమీలేదు సాహిత్యానికి. కాబట్టి ఆంధ్రదేశం వీరి అభివృద్ధిని కోరుతూంది.

★

ప్రజాశక్తి చందాదార్లకు

అడ్రసులు మార్చమని వ్రాసేటప్పుడు మీ పత్రిక నెంబరు, మీపేరు, జిల్లా, తప్పకుండా ఉదహరించాలి.

శనివారంలోగా మా ఆఫీసుకువచ్చే కొత్త చందాదార్లకు మాత్రమే ఆవారంపత్రికలు పంపబడతాయి. అందువల్ల సాధ్యమైనంతవరకు ప్రతివారూ కొత్తగాచేర్పిన చందాదార్ల లిస్టును శనివారంలోగానే మా ఆఫీసుకు చేరేటట్టు చూడాలి.

— మేనేజరు.

దొంగ మార్కెట్లు

ఉప్పుగుండూరు ఆహారకమిటీ అధ్యక్షులు శ్రీ గోగినేని న్యాషాభక్తరాజుగారు యిలా వ్రాస్తున్నారు:

ప్రాణసంరక్షణకు గుడ్డలులేక మహిళామణులు అనేక ప్రాంతాల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆంధ్రదేశంలో కూడా అలాంటి పరిస్థితులేర్పడే సూచనలు కనుపిస్తున్నాయి. కాని విపరీత లాభాలతో తమ పొట్టలు నింపుకొనే బట్ట దొంగల రాతిగుండెలు మాత్రం ఈ విషాదపరిస్థితులకు కరిగేట్టు లేవు. ఉప్పుగుండూరులో కమ్యూనిస్టు - రైతుసంఘాల వలంటీర్లు అనేక సార్లు గుడ్డల వ్యాపారులు దొంగతనంగా అమ్మే గుడ్డలను పట్టుకొన్నారు. "ఇకముందు సక్రమంగా అమ్మతామ"ని వర్తకులు వాగ్దానాలిచ్చినమీదట, అధికంగా తీసుకున్న డబ్బును వాపసు చేయించి వదిలేశారు. కాని తాలూకా కాంగ్రెసుసమితి సభ్యుడనని చెప్పుకొనే కోడూరి చెంచుపున్నయ్య కమ్యూనిస్టు వ్యతిరేకతకొద్దీ ఈగుడ్డల దొంగవ్యాపారులకు నాయకత్వం వహించి, దొంగమార్కెట్టును ప్రోత్సహించటానికి పూనుకున్నాడు. వ్యాపారులు కోటాగావచ్చిన మల్లు-లాంక్లాత్ తానులు దాచిపెట్టారు. ఈనెల 8వ తారీఖు బెల్లంగరటయ్య, మరియిద్దరు గుడ్డలుకొనవలెనని వెళ్ళి అడిగితే "నేను ఈరోజు యివ్వను" అని అమరా సుబ్బారావు అన్నాడు. అక్కడ చేరిన ప్రజలు బ్రతిమలాడినా, మొండిపట్టు పట్టారు. తర్వాత వలంటీర్లు ఆనాటికి గ్రామములో ఉన్న రివిన్యూ ఇనస్పెక్టరుకు రిపోర్టు చేశారు. రివిన్యూ ఇన్‌స్పెక్టరు దగ్గరవుండి ప్రజలకు పంపకం చేయించారు. గుడ్డల మార్కెట్టుకు నాయకుడైన కోడూరి చెంచుపున్నయ్య మర్నాడు వచ్చాడు. "తెలివితక్కువవల్ల వాళ్ళుగుడ్డలు యిచ్చారు. నేను ప్రజలకు లొంగుతానా? నాతడాఖా చూసుకో" అన్నాడు. తన కొట్టుచుట్టూ తిరుగుతున్న ప్రజల్ని లెక్కచెయ్యకుండా, కొత్తగా భాగం ఏర్పాటుచేసుకున్న ఫ్యాక్టరీలో పనిచేసుకుంటూ కూర్చున్నాడు. మధ్యాహ్నం భోజనానికి వచ్చినప్పుడు మళ్ళీ ప్రజలు గ్రామమునసబుగారిని వెంటపెట్టుకొని చెంచుపున్నయ్య కొట్టుకువెళ్ళి గుడ్డలు అడిగారు. కాని అతడు గుడ్డలుయివ్వటానికి నిరాకరించటమే కాకుండా, తనయింటిపైకి దొమ్మీకి వచ్చినట్లు కేసుపెట్టు తానని బెదరించాడు; గ్రామాధికారి వలహాకూడా వినలేదు. గ్రామాధికారి సాక్ష్యంతో ఈవిషయం పైకి తెలియజేశాము. ప్రభుత్వాధికారులు సక్రమ చర్యతీసికొని దొంగ వ్యాపారులను శిక్షించి ప్రజలకు గుడ్డలుఅందేటట్లు చెయ్యాలి.

ప్రెస్‌వర్కర్ భాయీ!

★

ఓహో ప్రెస్‌వర్కర్ భాయీ!
నీకిదె నా జోహారోయీ!!

కవినై నే పాడే పాటలు
గాలి బుడగలై గతించకుండా -
శబ్దానికి రూపం తెచ్చి -
భావానికి ప్రాణం పోసి -
విశ్వానికి భాష్యం చెప్పే
విజ్ఞాన ప్రదాతవు గావోయ్!

గ్రీసులో పేలిన తుపాకిగుండు
నా గుండెను దూసిందంటే -
చైనాలో అంతర్యుద్ధం
నా బుర్రను కలచిందంటే
వీరరెడార్మీ విజయపతాకం
నా కనుగోవల ఎగిరిందంటే -
ఎంతాశ్చర్యం? ఎంతాశ్చర్యం
అంతా నీచేతి చలవేనోయ్!

శాన్‌ఫ్రాన్సిస్కో వాగ్యుద్ధాలు
టోరీ ప్రముఖుల గద్దబద్దాలు
సిమ్లా కొండల సంప్రదింపులు
లండ నెలెక్షన్‌లో మదింపులు
అన్నీ వింటున్నామని యుంటే
అంతా నీ చేతి చలవేనోయ్!

అనాకార నాదానికి రూపం
అమర్చిపెట్టిన శిల్పమూర్తివోయ్!!
నాకలమే ఆగంజేస్తే
నీ చక్రం మోరంకేస్తే -
పయనించే జ్ఞానప్రపంచం
శయనిస్తుందోయ్ అచంచలంగా -
లేవోయీ! లేచినిలబడోయ్!
ఓయీ ప్రెస్‌వర్కర్ భాయీ!
ముందుకుసాగే ప్రపంచమంతా -
నీ యందనె నిలబడుతుందోయ్!

— బొల్లిముంత శివరామకృష్ణ

జగ్గయ్యపేట నూలుకొరతను వెంటనే తీర్చాలి

●

జగ్గయ్యపేట, పరిసర గ్రామాలలోఉన్న 462 మగ్గాలకు, జగ్గయ్యపేటలో నూలు అమ్మబడుచున్నది. గత రెండునెలలో అనగా మే, జూన్ నెలలో యీ క్రింద పుదహరించినరీతిగా గ్రామాలకు సరఫరా చేయబడుచున్నది:

12 వ నెంబరు నూలు 84 కార్డులకు నెలకు రావలసిన కోటా 840 పెట్టెలు. కాని మేనెలలో 40 పెట్టెలేవచ్చాయి. జూన్ సప్లయి తెలియదు. నెం. 14 నూలు 152 కార్డులకు 1520 పెట్టెలు సప్లయి కావాలి. కాని, జూన్‌లో 28 పెట్టెలే సప్లయిఅయింది. నెం. 20 నూలు 121 కార్డులకు 715 పెట్టెలు సప్లయి కావలసింది. మేలో 412, జూన్‌లో 248 పెట్టెలే ముట్టాయి నెం. 30 నూలు 50 కార్డులకు 175 పెట్టెలు సప్లయి కావలసింది మేలో 80½, జూన్‌లో 21 పెట్టెలే వచ్చాయి. నెం. 40 నూలు 19 కార్డులకు 57 పెట్టెలు సప్లయి కావలసింది. మేలో, 19, జూన్‌లో 29 పెట్టెలే సప్లయి అయాయి.

మే నెలలో: నెం. 12 నూలు నేయు పారిశ్రామికులకు 2 రోజులకు నెం. 20 నూలు నేసే వారికి 15 రోజులకు, నెం30నూలు నేసే వారికి 15 రోజులకు, నెం. 40 నేసేవారికి 10 రోజులకు సరిపడునూలు అందజేయబడినది.

జూన్ నెలలో: నెం14 నూలునేసేవారికి సుమారు ఒకరోజుకు, నెం. 20నూలు నేసే వారికి 10 రోజులకు, నెం 30నూలు నేసేవారికి 4 రోజులకు, నెం 40 నూలు నేసేవారికి 16 రోజులకు సరిపడునూలు అందజేయబడినది. కేవలం నేతమీదనే ఆధారపడి జీవించుచున్న యీ చేనేత పారిశ్రామికులు, నూలు సరఫరా పూర్తిగకుంటుపడుటవల్ల నిరుద్యోగులై అనేక యిబ్బందులకు గురియగుచున్నారు. ఈ పరిస్థితులవలన, బట్టకొరతను తీర్చుటకు ఏకైక మార్గమైన అధిక వస్త్రోత్పత్తి ఎంతో దెబ్బతగులుచున్నది. గత 2 నెలలో ముతుగునూలు పూర్తిగ రాకపోవుటచేత, ముతుగునూలు కార్డులుగలవారికి నెం. 20 నూలు యిప్పటకు గత నెలాఖరులో జిల్లా టెక్స్‌టైల్ కంట్రోలు ఆఫీసరుగారు ఆర్డరు వేసియున్నారు. కాని నెం. 20 నూలు, నెం. 20 కార్డులు గలవారికి ఒక్కొక్క కార్డుకు 10 రోజులకు మాత్రము సరిపడేనూలు అందజేయ బడుటవల్ల, ఆకార్డు నిరుపయోగముగా వున్నది. కావున టెక్స్‌టైల్ ఆఫీసరుగారు నెం 14,12 కార్డులను నెం. 20 కార్డులుగా భావించి మొత్తం నెం. 20, 14, 12 కార్డులకు సరిపడు పూర్తికోటా పంపించవలెనవియు, పారిశ్రామికులు నిరుద్యోగులు కాకుండుటకు, బట్టకొరతను తీర్చుటకు మార్గమైన వస్త్ర అధికోత్పత్తి కుంటుపడకుండుటకు, నూలును సక్రమంగా, జగ్గయ్యపేటకు పంపాలి.

●

దొండపాడులో

గుంటూరు తాలూకా దొండపాడులో తల్లం చిన లక్ష్మయ్య, మాచేటి సత్యనారాయణలు బట్టల వర్తకులు. ఈనెల 13 వ తేదీని వీరు మెట్టూరు లాంక్లాతు చలువ ఖద్దరు మల్లు. సీలింగురేట్లకన్నా ఎక్కువ ధరలకు అమ్ముచుండగా స్థానిక కమ్యూనిస్టులు పట్టుకున్నారు. తరువాత గ్రామ మునసబుగారి సమక్షంలో ఈ గుడ్డను మనిషికి 1¼ గజం చొప్పున సీలింగు రేటుకు ఇప్పించారు.

●

దుళ్ళలో

రాజమంద్రి తాలూకా దుళ్ళగ్రామంలో శ్రీకాకుళపు సుబ్బారావు అనే బట్టలవర్తకుడున్నాడు. ఈనెల 12వతేదీని నామాల వరలక్ష్మి నామాల సీతమ్మ అనువారు (ఏదిద కాపురస్తులు) బట్టలకోసం అతని అంగడికి వెళ్ళగా గజం రు 0-12-0 లకు అమ్మవలసిన బట్టను రూపాయి చొప్పున అమ్మాడు. పేరకకోటయ్య అనే దుళ్ళ కాపురస్తుడు ఆరకం గుడ్డనే ముప్పాతిక గజం తీసుకొని రశీదు అడుగగా, గుడ్డచించిన తానుపైనున్న నంబరు కాక ఇంకొక తాను నంబరువేసి బిల్లు ఇవ్వబోయాడు. కోటయ్యగారు దీనిని కనిపెట్టి తనకు గుడ్డచించిన తాను నెంబరుతోనే బిల్లు ఇవ్వమని కోరారు. వర్తకుడు అందుకు నిరాకరించి, "ఇష్టముంటే తీసుకో - లేకపోతే, పో" అని కసిరికొట్టి, గుడ్డనులాక్కొని డబ్బులను విసిరేశాడు. వెంటనే కోటయ్యగారు గ్రామ కమ్యూనిస్టుపార్టీ ఆఫీసుకువెళ్ళి జరిగినదంతా చెప్పారు. అక్కడివారువచ్చి అడిగేసరికి అసలు నేను గుడ్డ ఇవ్వనేలేదు పొమ్మన్నాడు. చుట్టూ మూగిన ప్రజలు ఈ వర్తకుని మోసాన్ని గుర్తించారు.

నూలు దొంగమార్కెటు

●

యార్లగడ్డ గ్రామ చేనేత పారిశ్రామిక సంఘ అధ్యక్ష కార్యదర్శులైన శ్రీ మండు హరిశ్చంద్రుడు, పోలిశెట్టి సీతాస్వామిగార్లు ఈదిగువ ప్రకటన చేస్తున్నారు:

"చల్లపల్లిలో బళ్ల వెంకటశివయ్య అనే నూలు వ్యాపారస్తుడున్నాడు. ఆయన చల్లపల్లి, యార్లగడ్డ మరికొన్ని గ్రామాలలోని మగ్గాలకు నూలు సప్లయిదారు.

ఈయన ఆ యా మగ్గాలకు సప్లయి చేయవలసిన నూలును పూర్తిగా సప్లయి చేయకుండా కోటా రాలేదనీ, అంతా రాలేదనీ, కొందరికి సగంయిచ్చీ, మరికొందరికి అసలు సప్లయి చేయకుండాను వేధిస్తున్నాడు.

యార్లగడ్డనుండి ఒక చేనేత పారిశ్రామికుడు తన కార్డుప్రకారం నూలు సప్లయిచేయమని అడిగితే, "నూలు రాలేదంటే వినవు. పలుగు, పార పట్టుకురా, నూలుతెద్దాం ఎక్కడన్నా" అని తెలవిచ్చాడు.

ఇట్లా చెప్పిన వాళ్లు, మూడు రోజులకే (5-7-45 రాత్రి) భట్టిప్రోలు (గుంటూరుజిల్లా) కాపురస్తులైన అడిగోపుల వెంకటరెడ్డి, మరొకరికి నెం. 40 8 డబ్బాలు, నెం. 20 5 పెట్టెలు (10 సౌనులు) నూలును 226 రూపాయలకు దొంగమార్కెట్టులో అమ్మారు. ఆనూలును భట్టిప్రోలుకు చేర్చుకొనుటకు వెళ్లుచుండగా, యార్లగడ్డ గ్రామ చేనేత పారిశ్రామిక సంఘంవారు చిమ్మగడ్డ వంతెనవద్ద 6 వ తేదీని పట్టుకున్నారు.

వెంటనే యీ విషయాన్నిగూర్చి తగు చర్య తీసుకొన వలసిందని కృష్ణాజిల్లా టెక్స్‌టైల్ కమీషనర్ (బెజవాడ) గారికి టెలిగ్రాంద్వారా తెలియజేయబడింది.

దొంగ వ్యాపారియైన బళ్ళ వెంకటశివయ్య నూలులై సెన్సును వెంటనే రద్దుచేస్తూ సరియైనవారికి లైసెన్సు యిప్పించి, క్రమపద్ధతిలో నూలు అందజేయుటకై టెక్స్‌టైల్ కమీషనరుగారిని కోరుతున్నాం.

ప్రజాశక్తి చందావివరాలు

★

సంవత్సర చందా	5—0—0
అర్ధసంవత్సర చందా	2—8—0
మూడునెలలచందా	1—4—0

రంగాముఠా వైఖరి ప్రజాక్షేమానికి విరుద్ధం

పిల్లలమర్రి వెంకటేశ్వర్లు

రాష్ట్ర చేనేత పారిశ్రామికసంఘ కార్యనిర్వాహకవర్గం 15-7-45వ తేదీన చీరాలలో సమావేశమైంది. ఈసమావేశం అతి ముఖ్యమైనసమస్యలను పరిష్కరించవలసివచ్చింది. ప్రభుత్వం యిటీవలనే నేతగుడ్డ ధరలను కంట్రోలు చేయుటకు యోచించుచున్నామని ప్రకటించింది. నూలుకొరత యేర్పడి కోటాల ప్రకారం పారిశ్రామికులకు నూలు సప్లయి కావడంలేదు. గత కార్యనిర్వాహకవర్గ సమావేశంలో చేనేత సంఘాలలోనుంచి కమ్యూనిస్టులను తొలగించాలని తీర్మానం ప్యాసు చేయబడింది. కాని నెల్లూరు, పశ్చిమగోదావరిజిల్లా సంఘాలు యీ నిర్ణయాన్ని వ్యతిరేకించాయి. తూర్పు గోదావరి జిల్లా సంఘం యింతవరకు యెట్టి చర్యతీసుకొనలేదు అనేక ప్రాథమిక సంఘాలు యీనిర్ణయం పారిశ్రామికులమధ్య చీలికలు కలుగజేస్తున్నదని. అందువలన మార్చుకొనవలెనని కోరుతూ తీర్మానించాయి.

కార్యనిర్వాహకవర్గం యీ సమస్యపై యే నిర్ణయాలకు వచ్చిందో చూద్దాం. పశ్చిమగోదావరిజిల్లా సంఘ కార్యదర్శియగు గంగరాజుగారు కార్యనిర్వాహకవర్గంలో వున్నారు. వీరు కమ్యూనిస్టులను తొలగించుట అక్రమమని, చీలికలకు దారితీస్తుందని స్టేటుమెంటు యిచ్చారు కార్యనిర్వాహకవర్గ సమావేశములో వీరిని ప్రగడ కోటయ్యగారి బృందం పరీక్షచేయటం ప్రారంభించింది. గంగరాజుగారు కమ్యూనిస్టు కాకపోయినప్పటికి కమ్యూనిస్టు సానుభూతిపరులని తేల్చుకొన్నారు. మేము యీవిషయం ఆలోచించుకోవాలి. మీరు బయటికి వెళ్ళవలసిందన్నారు, అధ్యక్షస్థానమలంకరించిన రమాకాంతరావుగారు. రాష్ట్రసంఘ తీర్మానాన్ని అతిక్రమించి స్టేటుమెంటు యిచ్చారు గనుక, గంగరాజుగారిని కార్యనిర్వాహకవర్గంలో నుంచి తొలగించుతూ తీర్మానం చేశారు. ఈతీర్మానాన్ని వీరికి తెలియచేశారు. దీనితోబాటు కమ్యూనిస్టులను తొలగించవలెనని జిల్లాసంఘాలను హెచ్చరించుతూ మరో తీర్మానం చేశారు.

చేనేత పారిశ్రామికసంఘాలకు ప్రభుత్వం అఖిల భారత చేనేతబోర్డులో ప్రాతినిధ్యం యివ్వనందున అసమ్మతి తెలియపరచుచూ తీర్మానించారు.

నేతగుడ్డ ధరంపై కంట్రోలు స్కీమును ప్రభుత్వం అమలు జరుపరాదనీ, ఈస్కీము వలన నేతపారిశ్రామికులు అనేక బాధలకు గురౌతారనీ తీర్మానించారు.

నేతగుడ్డపై కంట్రోలును వ్యతిరేకించారు. కమ్యూనిస్టులను వెడలగొట్టుటకు తీర్మానించి నేతసంఘాలలో చీలికలు కలుగ చేయవద్దని జిల్లాసంఘాలు, ప్రాథమిక సంఘాలు హెచ్చరించినప్పటికి నిరంకుశంగా స్థానికసంఘాల సలహాలను కాలదన్ని నేతసంఘాల నుండి కమ్యూనిస్టులను వెడల గొట్టాలని హుకుం జారీచేశారు. కమ్యూనిస్టు సానుభూతిపరులను కార్యనిర్వాహక వర్గంలోనుంచి త్రోసివేశారు. రంగాగారి గురుత్వం, ప్రగడవారి సారథ్యం యెటు దారితీస్తున్నాయో చూడండి.

గుడ్డదొరకక ప్రజలు అల్లాడుతున్నారు. నేతగుడ్డధర నాలుగురెట్లు పెరిగింది. ఆశాపిపాసులైన వ్యాపారస్థుల లాభాలకు అంతులేదు. ప్రజలతో సన్నిహిత సంబంధంలేని ప్రభుత్వ వుద్యోగులు కూడా నేతగుడ్డ ధరలను కంట్రోలు చేయవలసిన అవసరాన్ని గుర్తించారు. కాని రాష్ట్ర కార్యనిర్వాహక వర్గం మాత్రం పరిస్థితులను గమనించడంలేదు.

ఆ రోజు సాయంత్రం బహిరంగ సభ యేర్పాటు చేయబడింది. భార్యాసమేతంగా రంగాగారు సభకు వచ్చారు. తూర్పు గోదావరిజిల్లాలో బట్టల వ్యాపారస్థులగు ఇనుమర్తి వీరభద్రరావుగారు అధ్యక్షత వహించారు.

అధ్యక్షులు మాట్లాడుతూ, నేతగుడ్డ ధరల కంట్రోలువలన పారిశ్రామికులు మొదలంటా నాశనమవుతారని, ప్రభుత్వం కంట్రోలు పెడితే నేత పారిశ్రామికులు ప్రాణాలొడ్డి ప్రతిఘటించాలని గర్జించారు. నూలుకోటా సక్రమంగా రావటంలేదనీ. రంగులు దొరకడంలేదనీ, వాటికై తీవ్రమైన ఆందోళన చేయాలనీ కోరారు. చివరకు కమ్యూనిస్టులను సంఘాలలోంచి తొలగించాలని కోరారు. వీరు గుడ్డ ధరల కంట్రోలును వ్యతిరేకించుచున్నారంటే ఆశ్చర్యం యెవ్వరికీ కలుగదు. వీరు వ్యాపారస్థులు అందువల్ల తమ అధికలాభాలు పోతాయని, స్వేచ్ఛావ్యాపారం సాగటానికి నేత పారిశ్రామికులను ప్రాణాలొడ్డికంట్రోలును ప్రతఘటించమంటున్నారు. అందుకనే వీరి దురాశను ప్రతిఘటించుచున్న కమ్యూనిస్టులను నేత సంఘాలనుంచి తొలగించమంటున్నారు. నేత పారిశ్రామికులకు నూలు దొరకటంలేదని, రంగులు దొరకటంలేదని మొసలికన్నీళ్ళు కార్చుతున్నారు. పారిశ్రామికులకు కోటా ప్రకారం నూలు దొరకాలంటే పారిశ్రామికులను ఐక్యపరచాలి. కాని తమ స్వార్థానికి ప్రతిబంధకంగా వున్నారుకదా అని కమ్యూనిస్టులను తొలగించాలని కోరుతూ, పారిశ్రామికులలో చీలికలు కలుగజేస్తున్నారు. వీరు తమ స్వార్థాన్ని కొంత వదలుకుంటేనేగాని పారిశ్రామికులకు సేవ చేయజాలరు.

రంగా దుర్బోధలు

తరువాత రంగాగారు ఉపన్యాసం ప్రారంభించారు. నేత పారిశ్రామికులు చాలా అమాయకులని అన్నారు. కమ్యూనిస్టుల మాయలో పడవద్దని ఉద్బోధించారు. ప్రజలపై వీరికి వుండే విశ్వాసం యీ రెండు వాక్యాల వల్ల వ్యక్తపడుతుంది. నేతపారిశ్రామికులు రంగా చిత్రించినట్లు అమాయకులు మాత్రం కారు. వారి కోర్కెలు వారికి తెలుసు. రంగాగారి రాజకీయాలు ప్రజలలో చీలికలు కలుగ చేస్తున్నాయి. కంట్రోలు ప్రజలందరికీ ఉపయోగం. కాని నేతపారిశ్రామికులను అమాయకులంటూ రంగాగారు కుంటి సాకులు చూపి ప్రభుత్వం రక్షణలు యివ్వటంలేదు గనుక పారిశ్రామికులు కంట్రోలును వ్యతిరేకించాలంటున్నారు.

నేత పారిశ్రామికులకు రక్షణలు కావాలంటే ప్రజలంతా ఆమోదించుతారు. వీరి సహకారంతో పారిశ్రామికులు తమ కోర్కెలను యీడేర్చుకొనవచ్చును. అంతేగాని, ప్రజలు మానరక్షణకై గుడ్డదొరకక అల్లాడుచుంటే, స్వార్థపరులైన వ్యాపారస్తుల బూటకపు మాటలను నమ్మి కంట్రోలును వ్యతిరేకించుట ఆత్మవినాశకరం.

స్వార్థపరులైన వ్యాపారస్తుల ఆట కట్టించి కంట్రోలును జయప్రదం చేయటానికి పూనుకోవాలి. మజూరీలు నిర్ణయం చేయాలని, కోటాల ప్రకారం నూలు సప్లయి కావాలని, నూలు ధరలు, రంగుధరలు తగ్గించాలని సూచనలుచేస్తూ ప్రజాసహకారాన్ని పొందాలి. వెనిపటిన రంగాగారు సూచించుచున్న కుటుంబానికి రు. 100లు ఆదాయం నీటిబుడగలా వుంటుంది.

నేతపారిశ్రామికులకు ఒక విజ్ఞప్తి. ప్రస్తుతం రాష్ట్ర చేనేత సంఘ నాయకులు ప్రజలకు-పారిశ్రామికులకుమధ్య వైరుధ్యంఏర్పరచుతున్నారు. తత్ఫలితంగా నేతపారిశ్రామికులకు జీవనరక్షణలు కలుగక పోవుటయే గాక, ప్రజలకు గుడ్డ దొరకుటలేదు. దొంగ మార్కెటు పెచ్చుపెరుగుతుంది. ఈ విపత్తునుంచి బయటపడాలంటే, యీ రాష్ట్రీయ కక్ష్యానికి స్వస్తి చెప్పాలి. కంట్రోలును బలపరచుతూ పారిశ్రామికులు ముందుకురావాలి.

ఇందుకు తార్కాణంగా గుంటూరు జిల్లా చేనేత పారిశ్రామిక సంఘం వారి మెమోరాండమునకు కొంటి రామమూర్తిగారిచ్చిన జవాబు చూడండి.

గుంటూరు జిల్లా సంఘానికి పెత్తనంలో వున్న రంగాముఠావారు నేతగుడ్డపై కంట్రోలు పెట్టవద్దనీ, కంట్రోలు కావాలంటున్న కమ్యూనిస్టుల బారినుండి రక్షించవలెననీ - మద్రాసు ప్రభుత్వ సలహా దారగు కొంటి రామమూర్తిగారిని ప్రార్థించారు.

కొంటి రామమూర్తిగారు మిల్లుగుడ్డ ధర మూడురెట్లు పెరిగిందని, నేతబట్టధర 5 రెట్లు పెరిగిందని, ప్రజలందరి క్షేమాన్ని చూడాలని, పారిశ్రామికులుకూడా ఈవిషయం ఆలోచించాలని, కంట్రోలుపెట్టి పారిశ్రామికుల రక్షణ మగూర్చి ఆలోచించుతామని తెలియజేశారు.

ఈ జవాబును చదువుకొనియైనా రంగాముఠాకుచెందిన వీరభద్రరావు, ప్రగడ కోటయ్యగార్ల బృందము దేశభక్తిని అలవరచుకొందురుగాక.

ప్రభుత్వం కలిగించే రక్షణలు ఎక్కువగా వ్యాపారస్థులకేవుపయోగపడవచ్చు. కాన పారిశ్రామికులు మేల్కొని కంట్రోలును బలపరచుచూ న్యాయమగు తమరక్షణలకై ఆందోళన చెయ్యాలి

(5 వ పేజీ తరువాయి) రించడంలేదు. స్వతంత్రమైన పాలసీని అవలంబిస్తోంది. వ్యవసాయం (ఎస్టేటులు విభజించబడిన తరవాత), అడవులు, ప్రభుత్వసొత్తు. చాల అడవులు జర్మనులచేత నేలమట్టం చేయబడ్డాయి. తిరిగి వాటిని పెంచడానికి కనీసం 30 సంవత్సరాలైనా పడుతుంది.

పారిశ్రామిక రంగంలో, ప్రభుత్వం వివిధ రకాల కంట్రోలును అమల్లో పెట్టింది. ఉదాహరణకు, ఇళ్లలో ఉపయోగపడే వివిధ వస్తుసామగ్రి ఎలా తయారౌతుందంటే: దేశం మొత్తంమీద అలాంటిసామగ్రి ఎంతతయారు కావాలో మొదట ప్రభుత్వం ఒక అంచనా వేస్తుంది. దానికైన ఖర్చులు లెక్కవేస్తుంది. న్యాయమైన లాభపురేటు నిర్ణయించి, బజార్లో ఒక్కొక్కవస్తువు ఎంతెంతధరకు అమ్మాలో ప్రకటిస్తుంది. అంతకు మెక్కువ ఎవరూ అమ్మకూడదు. ఒక్కొక్క కర్మాగారం, లేదా కంపెనీలో ఎంతెంత సరుకు తయారు కావాలో కూడా ఒక గరిష్ఠ ప్రమాణం నిర్ణయించి, అది పూర్తి అయినతర్వాత ఆ కర్మాగారం, లేక కంపెనీ అదనంగా ఏ అవసర వస్తువైనాసరే, తయారుచేసి తనయిష్టంవచ్చిన ధరకు అమ్ముకోవచ్చు.

విదేశాలలోఉన్న పోలిష్ ప్రజలు

పోలెండ్ అధ్యక్షుణ్ణి నేనొక ప్రశ్న అడిగాను: "ఇంగ్లండులోను, ఇతర దేశాల్లోను, నివసిస్తున్న పోలిష్ ప్రజలెంతమంది తిరిగి మీ దేశం రావడానికి అవకాశాలున్నాయి?"

దీనికాయన స్పష్టంగా, నిర్మొగమాటంగా, సందేహాలకు తావులేకుండా, ఇలా జవాబు చెప్పారు:

"నూతన పోలెండును పునర్నిర్మించడంలో చేయూత నివ్వడానికి ఇష్టంవున్న వారందరిని మేం హృదయ పూర్వకంగా ఆహ్వానిస్తాం. కొత్తగా అమల్లోకి వచ్చిన వ్యవసాయ చట్టాన్ని, మత స్వాతంత్ర్యాన్నీ, విద్యాభివృద్ధిని, వ్యతిరేకించే వారిని మేం అంగీకరించం. ఫాసిస్టు విధానంపట్ల ప్రత్యేకంగాగాని, పరోక్షంగాగాని, సానుభూతి కలిగియుండి, పూర్వం హిట్లరు పరిపాలనకు తోడ్పడ్డవారిని మేం రానీయం. సోవియట్ వ్యతిరేకత, ప్రజా వ్యతిరేకత, ఫాసిజంపట్ల సానుభూతి, హిట్లరుతో స్నేహం - ఇవేగదా మొదట యుద్ధానికి కారణం? ఈ రోజున మాత్రం పోలెండ్‌లో అలాంటి ఆవలక్షణాలేవీ తలెత్తడానికి వీల్లేదు."

నేను తిరిగి వెళ్ళడానికి ప్రయాణ మవుతుంటే,నా చేతిని తనచేత్తో గట్టిగాపట్టుకొని, ఉద్రేకంతోనూ ఉత్సాహంగాను ఆయన అన్న మాటలు యివి.

ఆంధ్రరాష్ట్ర మునిసిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధుల సమావేశం

ఆగష్టు 5 వ తేదీని పై సమావేశంజరుగుతుందని ఇదివరలో తెలియపర్చాం.

కాని మార్చి 12 వ తేదీన సమావేశం జరుపుటకు నిశ్చయించబడింది.

ప్రతినిధుల యెన్నికలు జరిపి, పేర్లు రాష్ట్ర ఆపీసుకు ఆగష్టు 1 వ తేదీ లోపుగా పంపాలి.

స్థానిక పరిస్థితులమీద తీర్మానాలుకూడా 1 వ తేదీలోపే పంపాలి.

యల్. వి. రత్నం,
ప్రధాన కార్యదర్శి.

ప్రజాశక్తి

లీగ్ పొరపాటు అంచనా

(4 వ పేజీ తరువాయి)

కాంగ్రెసు, వేవెల్ ప్లాను పరిహారమైనా, హిందూ-ముస్లిం సభ్యుల సమాన ప్రాతినిధ్యానికి అంగీకరించి, ముస్లిం సభ్యులందరినీ ముస్లింలీగ్ మాత్రమే నియమించాలనే కోర్కెను ఒప్పుకొనియున్నట్లయితే బాగుండేది. అలా చేయడంవల్ల కాంగ్రెసు ప్రతిష్ఠ తగ్గక పోవడమే కాకుండా, అనేకరెట్లు ఎక్కువైయుండేది. 25 సంవత్సరాల తరవాత హిందూ-ముస్లిం సామరస్యం కరతలామలకమై యుండేది. మన జాతీయోద్యమ చరిత్రలో ఒక కొత్తఅధ్యాయం ప్రారంభమైయుండేది.

పైవాటికి కాంగ్రెసు అంగీకరించియున్నట్లయితే ముస్లింలీగు - కాంగ్రెసు కలిసి ఒకే జాబితాను తయారుచేయడం సాధ్యమయి యుండేది.

అంతేకాక కాంగ్రెసు స్థానాలలో ముస్లిం జాతీయవాదులను చేర్చుకోడానికి లీగ్ నాయకులు ఆక్షేపణ చెప్పలేదని రూఢిగా తెలుస్తూవుంది. ఇలాచేస్తే హిందూమహాసభ బలపడిపోతుందనీ, కాంగ్రెసు అనుచరులలో ఒక భాగం హిందూమహాసభలో చేరిపోతారనీ - కొందరు భయపడుతున్నారు. కాని ఈ భయానికి ఆధారంలేదు. రాజకీయంగా హిందువులు ముస్లింలకన్నా ఎక్కువ అభివృద్ధిపొందారు. కాబట్టి వారిలో హిందూమహాసభ వినాదాల యొక్క అభివృద్ధి నిరోధకత్వాన్నిసులభంగా బహిరంగపరచగలము. ముస్లిం ప్రజాసామాన్యంలో లీగ్‌ను ఓడించడం ఎంతకష్టమయినదనో, హిందువులలో హిందూమహాసభను ఓడించడం అంత సులభమైనదని; కాంగ్రెసు నాయకులు ముస్లిం ప్రజల ప్రధాన సంస్థయైన లీగ్‌తో రాజీచేసుకోకపోతే ఇక ఒకటే మార్గం మిగులుతుంది. అభివృద్ధిని ఆరికట్టే హిందూమహాసభతో చేతులు కలపవలసివస్తుంది. అప్పుడే పరిస్థితులు యిటువైపు దారితీస్తున్నాయి.

ఐతే, సిమ్లా సమావేశంలో కాంగ్రెసు-లీగ్ ఐక్యత కుదరకపోవడానికి ముఖ్యకారణం ఏమంటే - కాంగ్రెసు నాయకులు లీగ్ యొక్క శక్తిని తక్కువ అంచనావేశారు: కాంగ్రెసుశక్తిని ఎక్కువ అంచనావేశారు; వేవెల్ కమవాంఛలను బలపరుస్తారని భ్రమపడ్డారు.

రెండవ సోదర పార్టీమీద అనుమానాలు - తమ సంస్థ యొక్క బలాన్ని చూచుకొని గర్వించడం - బ్రిటిష్ పాలకవర్గం మీద ఆశలు - ఇవి స్వాతంత్ర్య సౌధనిర్మాణానికి మార్గంకాదు.

ముస్లింలీగు వైఖరి

లీగ్ నాయకులు కూడా సరిగా యిదే ధోరణిలో ఆలోచించారు గనుక వారి ఆచరణ విధానం కూడా దాదాపు యిట్టిదే.

మొదట కాంగ్రెసు మాదిరిగానే ముస్లిం లీగ్ కూడా ఒడంబడిక జరిగితీరుతుందని ఆశించింది. బ్రిటిష్ ప్రభుత్వానికి ఒడంబడిక అవసరమైంది గనుక సాధ్యమైనంత ఎక్కువ అధికారం గుంజుకొనవగలగాలని కాంగ్రెసునాయకు లాలోచిస్తే, ముస్లింలీగ్ నాయకులు బ్రిటిష్ వాగ్దానంమీద ఆశపెట్టుకొని (లీగ్ అంగీకారం లేనిదే యేరాజ్యాంగాన్ని ఇండియాలో అమలుజరపం - అని ప్రభుత్వం యిదివరలో ఒక వాగ్దానం చేసింది. వం.) ఎక్కువ అధికారం కోసం ఉవ్విళ్ళూరారు. కాంగ్రెసు నాయకులవలె వీరు కూడా తమ సంస్థయొక్క బలాన్ని చూచుకొని గర్వించారు. రెండు సంస్థల నాయకుల్లోనూ కూడా పరస్పర ద్వేషాలు, అనుమానాలు తీవ్రంగా ఉన్నాయి.

దేశమంతటా కాంగ్రెసుకు గల బలాన్ని చూచుకొని, కాంగ్రెసు నాయకులు యితరుల బలాన్ని లెక్కచేయనట్టే, లీగ్ నాయకులు ప్రభుత్వానికి-కాంగ్రెసుకూ మధ్య తాము మంచి కీలకస్థానంలో ఉన్నట్టుగా భావించి, బిర్రబిగుసుకొని కూచున్నారు. ఇలాంటి వైఖరివల్ల ఆటు ప్రభుత్వం, యిటు కాంగ్రెసు తమ కోర్కెలకు లొంగిరాక తప్పదని భ్రమపడ్డారు.

క్లుప్తంగా చెప్పాలంటే, లీగ్‌వాదన యిది: పాకిస్తాన్ స్థాపన దాని ఆశయం. సమాన ప్రాతినిధ్యంయిస్తే తాత్కాలికంగా కొత్త కార్యనిర్వాహకవర్గంలో ప్రవేశించడానికది అంగీకరించింది. ఎందువల్లనంటే,పాకిస్తాన్ వ్యతిరేకులకు మెజారిటీఉంటే తన ఆశయానికి భంగం వాటిల్లుతుందని లీగ్ భయం. కనుక, యింతకు తక్కువ యేది ఇచ్చినప్పటికీ, జిన్నా వినడంలేదు; లీగ్ ఆశయానికది ద్రోహంగా ఎంచుతున్నాడు.

జులై 14 వ తేదీని పత్రికా విలేఖరుల సభలో జిన్నా యిలా అన్నారు:

"వేవెల్ ప్లానును బాగా పరిశీలించిన మీదట తేలిందేమంటే: అదొక పెద్ద వల....అందులోకి మమ్మల్ని తోయడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. కాని అందులో మేం పడలేదు. దానికి మేమంగీకరించియున్నట్లయితే, మా గొంతుకలు మేం కోసుకొని యుండేవారం."

ఇదంతా ప్రచారంకోసం. ఆఖరుదశలో, పలికిన మాటలేగాని, మొదటినుంచీ లేవు. వేవెల్‌ప్లాను ప్రచురింపబడినవెంటనే అదొక 'వల'అని జిన్నా భావించలేదు. పైపెచ్చు, అందులో ఒక్క మాటనుకూడా మార్చడానికి వీలులేదని తెలియజేశారు సమావేశం జరుగుతుండగా కూడ, అందులోవున్న ముఖ్య సూత్రాలకు తన ఆమోదాన్ని ప్రకటించారు. వైస్రాయి ఐదు ముస్లిం స్థానాలలో నాల్గింటిని మాత్రమే లీగ్‌కి ప్రత్యేకించదలచుకున్నప్పుడు, జిన్నా ఆశలు అడియాసలయాయి. అప్పుడన్నారు, పైవిధంగా!

లీగ్ పొరబాటు అంచనా

అసలు విషయం చెప్పాలంటే, మొదట్లో జిన్నాకు వేవెల్‌మీద ఎక్కువ విశ్వాసం ఉంది. ఆయన పాతకాలంనాటి రాజ్యాంగవేత్త. (Old Constitutionalist) కావడంమూలాన తన సోదర పార్టీలకంటె బ్రిటిష్ ప్రభుత్వంమీదే విశ్వాసం ఎక్కువ. రెండోవిషయం: పాకిస్తాన్‌పట్ల హిందువులకైతే వ్యతిరేకత ఉండొచ్చుగాని, బ్రిటిష్‌వారికి వ్యతిరేకత ఎందుకుంటుంది? అని జిన్నా భావిస్తూ ఉండవచ్చు.

మొత్తంమీద, లీగ్ నాయకులు తమ మామూలు ధోరణిలో, ఒత్తిడిమూలంగా, అధికారం లాక్కుందామని చూచారేగాని, ఐక్యతద్వారా వేవెల్‌ని ఎదుర్కోలేకపోయారు.

ఫలితం ఏమయింది?

పాకిస్తాన్ కోరిక మొదట యెక్కడుందో యిప్పుడూ అక్కడేవుంది. భారత సమస్యా పరిష్కారానికి జిన్నా అడ్డువచ్చాడనే అపకీర్తి మాత్రం బాగా వ్యాపించింది.

పోనీ, బ్రిటిష్ ప్రభుత్వంద్వారా సమాన ప్రాతినిధ్యమైనా లభించిందాఅంటే,-అదీలేదు

తూర్పు పాకిస్తాన్‌లో (బెంగాల్) ముసల్మాన్ ప్రజల దుస్థితిని లీగ్ తొలగించజాలనందుకుఅక్కడిప్రజలు తమ నాయకుల్ని ప్రశంసిస్తారా? తమ నాయకుడైన జిన్నాను ప్రభుత్వంగాని, కాంగ్రెసుగాని లెక్కచేయడంలేదని తెలుసుకోవడంవల్ల వారికి ఆనందం కలుగుతుందా?

కాబట్టి, ముస్లింలీగ్ నాయకులు తమ సంస్థయొక్క శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఐనా, కాంగ్రెసుతో ఒడంబడిక చేసుకోవలసింది. గోవిందవల్లభపంతుతో జిన్నా సంప్రదించినమాట వాస్తవమే. కొత్తకార్యనిర్వాహకవర్గంలో కనీసం ఒక స్థానం జాతీయ ముస్లింకి యివ్వాలని పంతు, అన్నిస్థానాలు లీగ్‌కే యివ్వాలని జిన్నా, పట్టుపట్టడంవల్ల ఆ సంప్రతింపులు విఫలమయాయి. ఫలితం? వైస్రాయి ఒక ప్రభుత్వ తొత్తుని నియమించడానికి నిశ్చయించుకున్నాడు; జిన్నా యీ నిర్ణయాన్ని వ్యతిరేకించిన మాట నిజమే అయినా, జిన్నాకోరికమాత్రం సఫలం కాలేదు.

కాబట్టి, జిన్నా ఒక జాతీయ ముస్లింకి కార్య నిర్వాహకవర్గంలో స్థానమీయడానికి అంగీకరించియున్నట్లతే, వైస్రాయియొక్క పన్నాగం పటాపంచలయేది. యూనియనిస్టు పార్టీ నామమాత్రంగానే మిగిలియుండేది. కాంగ్రెసుకో హిందూమహాసభ యొక్క పలుకుబడి సన్నగిలేది. ముస్లింలీగ్‌వల్ల కాంగ్రెసువాదుల్లో ఇప్పుడున్న అనేక అనుమానాలు మాయమై ఉండేవి.

ఎన్నికలవల్ల ఉపయోగం

పైవిధంగా లీగ్ నాయకులు కాంగ్రెసుతో అంగీకారానికివచ్చి, సాధ్యమైనంత త్వరలో ఎన్నికలుజరిగితే, రెండుసంస్థలకూ ఎంతెంత బలంఉందో స్పష్టంగా తెలుస్తుంది. లీగ్ సభ్యులు అత్యధిక సంఖ్యాకులుగా ఎన్నుకోబడినప్పుడు కాంగ్రెసు వాదుల్లో చాలా మంది యదార్థాన్ని గుర్తించక మానరు. ప్రస్తుతం నిష్కపటులైన కాంగ్రెసువాదులనేకులు లీగ్‌కి ముస్లిం ప్రజాసామాన్యంలో పలుకుబడి లేదని భావిస్తున్నారు. ఇది పొరబాటే కావచ్చు; కాని, ఉన్నసంగతి అది. వారి అజ్ఞానంచూచి ముస్లింలీగ్‌వారు వెక్కిరించ నవసరంలేదు. మన జాతీయోద్యమం యొక్క పరిణామాన్ని తెలుసుకుంటే, ఎవరూ అలా వెక్కిరించరు. కమ్యూనిస్టులమైన మేము మాత్రమే ముస్లింలీగ్ ముసల్మాను ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తోందని గ్రహించాము కనుకనే లీగ్ ఆశయాలను కాంగ్రెసువాదుల్లో ప్రచారం చేస్తున్నాం. ఎందువల్లనంటే, యీరెండు ప్రధాన సంస్థలను ఒకదానితో ఒకటి సన్నిహితం చేయడంవల్లనే మనదేశానికి మోక్షం ఉన్నదని మేం గ్రహించాం. కాని, పైసంస్థలు రెండూ యిలాకాదు; ఒకసంస్థ రెండోసంస్థను తనవైపుకి లొంగదీయాలని చూస్తోంది. ఉభయుల్లోనూఉన్న మంచిని చూడ్డంలేదు.

ఎన్నికలలో ముస్లింలీగుకి మెజారిటీ వచ్చినట్లు రూఢీ అయితేనేగాని, కాంగ్రెసువాదులు పాకిస్తాన్ సమస్యనుగూర్చి తీవ్రంగా ఆలోచించరు. అదిజిన్నాకల్పించిన ఒకబూటకపు సౌధ మనుకొంటున్నారు యిప్పుడు ఇతర లీగ్ నాయకులు వట్టి బలహీనులు గనుక జిన్నా నాయకత్వాన్ని వారు తొలగించలేకుండా ఉన్నారని భావిస్తున్నారు.

లీగ్ నాయకులు ప్రభుత్వం తోను, కాంగ్రెసు నాయకత్వంతోను సంప్రతింపులు జరపడం ద్వారా తాము కోరుతున్న సమాన ప్రాతినిధ్యంవస్తుందని ఇంతవరకు ఆశించారు. కాని, అలా రాలేదు. ఇక లీగ్ నాయకుల ముందున్న కర్తవ్యం ఏమంటే: ఎన్నికల ద్వారా తమ కోర్కెల నెంతవరకు ప్రజలు బలపరుస్తున్నారో చూచుకోవలసి యుంది. అప్పుడే లీగ్ కోర్కెలను గూర్చి కాంగ్రెసు తీవ్రంగా ఆలోచించడంగాని, వాటిని అంగీకరించడం గాని జరుగుతుంది. కాబట్టి లీగ్ నాయకులు వెంటనే ప్రజా సమీకరణకు పూనుకోవాలి.

భగ్నంకావడానికి కారకులెవరు?

సిమ్లా సమావేశం భగ్నంకావడానికి కారణం ముస్లింలీగ్ అని కాంగ్రెసు నాయకులూ, కాంగ్రెసే అని లీగ్ నాయకులూ - బహిరంగంగా, బల్లగుద్ది ప్రకటనలు చేస్తున్నారు. కాని సిమ్లాసమావేశంలో జరిగిన ఘటనలను, అక్కడ ఉత్పన్నమైన సమస్యలను, ఒక్కొక్కరు అనుసరించిన మార్గమును, ప్రకటించిన దృక్పథాలను - నిష్పక్షపాతబుద్ధితో పరిశీలించినట్లయితే, రెండుపక్షాలవారూ సమానంగానే బాధ్యులని తెలుసుకోవచ్చు.

- ఇరుపక్షాలూ వేవెల్‌వైపు యెదురు చూచాయి.
- ఇరుపక్షాలూ ఒకదానితో ఒకటి సంబంధం పెట్టుకోలేదు.
- ఇరుపక్షాలూ ప్రజల సంగతి మరచిపోయాయి.
- ఇరుపక్షాలూ ఓడిపోయాయి.

రెండు పక్షాలమధ్య సంతృప్తికరమైన రాజీకి చక్కని అవకాశం ఉన్నప్పటికీ, సమావేశం భగ్నమవడం మరింత విచారాన్ని కలిగించుతోంది. దేశాయి - లియాఖత్ ఆలీ ఒడంబడిక యిదివరకే కాంగ్రెసు - లీగ్‌లకు సమాన ప్రాతినిధ్యం ఉండాలని అంగీకరించింది. వేవెల్ దాన్ని మార్చివేసి, హిందూ-ముస్లింలకు సమాన ప్రాతినిధ్యమనే మాత్రాన్ని ప్రవేశపెట్టారు. కాంగ్రెసుమట్టుకి కాంగ్రెసూ, ముస్లింలీగ్‌మట్టుకి ముస్లింలీగూ వేవెల్ ప్రణాళికను ఆధారంగా చేసుకొని, తన కోర్కెలను సాధించదలచుకొంది. రెండవ పార్టీకి సాధ్యమైనంత తక్కువ యివ్వాలని చూచింది. అంతేగాని పూర్వపు ఒడంబడికను తిరిగి పైకి తీయాలనే దృష్టి రెండు పార్టీలకూ లేకపోయింది. మధ్యలో ప్రతిష్ఠంభన యేర్పడి, సమావేశం వాయిదా పడినతరవాత కూడా దేశాయి - లియాఖత్ ఒడంబడికపై ఆలోచించడానికి ఎట్టి ప్రయత్నం జరగలేదు. ఇలా ఎందుకు జరిగిందో కాంగ్రెసూ తెలియజేయలేదు: ముస్లింలీగూ తెలియజేయలేదు. అసలుకారణం ఏమంటే, ఆ ఒడంబడిక యిప్పుడు అనవసరమని రెండుపక్షాలూ అభిప్రాయపడ్డాయి. వేవెల్‌వైపుకే రెండు పక్షాల నాయకులూ దృష్టులనిగిడ్చి చూచారు.

రాబోయే ఫలితాలు

సిమ్లా సమావేశం భగ్నం కావడంవల్ల, ముందు ముందు (మిగతా 10 వ పేజీలో)

వెంటనే ఎన్నికలు జరగాలి

(9 వ పేజీ తరువాయి) రాబోయే ఫలితాలు ఎలావుంటాయో ఒకసారి పరిశీలిద్దాం.

1. అంతర్జాతీయంగా, మనకిక మొఖం చెల్లని స్థితి కలుగుతుంది. సామ్రాజ్యవాదుల పాచిక బాగా పారింది. ఇండియాలో ఐక్యత లేకపోవడంవల్లనే ఇలా జరిగిందని బ్రిటన్‌లో టోరీ పత్రికలు వ్యాఖ్యానాలు చేస్తున్నాయి. అంటే, భారతీయులందరిమీదా నింద మోపుతున్నాయన్న మాట. ఇక అభివృద్ధిని కోరే వారి సంగతి. వీరు మనలో ఒకపార్టీయైన ముస్లింలీగ్‌మీద నిందమోపుతున్నారు. ఫలితము మాత్రం అంతా ఒకటే: బ్రిటన్ పేరు నిలిచింది; మనపేరు మట్టిపాలైంది!

2. రాజకీయంగా, మనదేశం రెండు శత్రు సేనలమధ్య యుద్ధరంగంగా మారిపోతుంది. ప్రతివారూ తమ సంస్థయొక్క గొప్పతనాన్ని చూచుకొని గర్వంగా విర్రవీగుటూ, రెండవపక్షాన్ని అసహ్యించుకొంటున్నారు: ఒకరి నాయకుల్ని ప్రేమించడమంటే అర్థం రెండోవారి నాయకుల్ని తూలనాడ్డంగా మారిపోయింది! ఒకరి సిద్ధాంతాలకై పోరుసల్పడమంటే, రెండవవారి సిద్ధాంతాల్ని ఖండించడమన్న మాట! "మనం చెప్పేది వాడు వినడు; కనుక వాణ్ణి పాతేద్దాం!" అనే దృక్పథం దేశమంతటా వ్యాపిస్తోంది.

(3) ఆర్థికంగా చూస్తే, పరిస్థితులు ముందు ముందు ఇప్పటికంటె బాగా విషమరూపం దాలుస్తాయి. ప్రభుత్వం మనదికాదు గనుక మనమేమీ చేయలేమని రాజకీయప్రచారకులు చేతులుముడుచుకొని కూచుంటారు. దొంగ వ్యాపారస్థులు, లంచగొండి ఉద్యోగులు ప్రజల జీవితాన్ని అంతకంతకు దుర్భరం చేస్తారు. దేశంయొక్క ఆర్థికవిధానాన్ని ఊబిలో ముంచుతారు. కేంద్రప్రభుత్వం యుద్ధానంతర పునర్నిర్మాణానికి ప్లానులమీద ప్లానులు వేస్తూ ఉంటుంది; కాని ఒక్కటీ ఆచరణలోకిరాదు. పండిట్ నెహ్రూ తన 'నేషనల్ ప్లానింగ్, కమిటీ'చేత తిరిగి పని ప్రారంభింప జేయిస్తారు. కాని, యీ లోగా బ్రిటిష్ గుత్త వ్యాపారస్థులే పెత్తనం చెలాయిస్తూ ఉంటారు. దేశీయ పెట్టుబడి దారులతో రహస్యంగానూ, బహిరంగంగానూ ఒడంబడికలు చేసుకుంటారు.

ముందు మార్గమేది?

అయితే, ఇప్పుడు మన ముందున్న మార్గంఏమిటి? ఈ ఊబిలోనుండి బయట పడ్డం ఎలా?

త్వరలో కాంగ్రెసు–లీగ్‌లమధ్య ఐక్యత కుదరడానికి నాకు తోచిన ఒక మార్గం సూచిస్తాను. దేశంలో రాజకీయ జీవితం తిరిగి తలయెత్తి, ప్రజాస్వామ్య పద్ధతులప్రకారం నిర్మాణాత్మకమైన కార్యక్రమం ప్రారంభమైనప్పుడే యిది సాధ్యమౌతుంది.

(1) సాధ్యమైనంత త్వరలో కేంద్ర శాసనసభకు, రాష్ట్ర శాసనసభలకు, ఎన్నికలు జరగాలి.

మన జాతీయనాయకులు–దేశాన్ని ఇంత ఉన్నతస్థితికి తీసుకొచ్చిన మన జాతీయ నాయకులు – ప్రధానాశయాలలోను, వెన్వెంటనే నెరవేర్పవలసిన కార్యక్రమం విషయంలోను, ప్రాతినిధ్య అర్హతల విషయంలోను, భేదిస్తున్నప్పుడు యిదితప్ప మరొకమార్గం లేదు. ప్రజలమధ్యకువెళ్ళి, ప్రజలయెదుట ప్రతి సమస్యను చర్చించి, ప్రజాభిప్రాయంయొక్క అండతో పరిష్కారమార్గం కొరకు ఆలోచనలు జరుపవలసియుంది.

(2) రాజకీయ ఖైదీలందరినీ ప్రభుత్వం విడుదలచేసి, కాంగ్రెసుకమిటీలపై ఉన్ననిషేధాన్ని తొలగించేలా ఆందోళన చేయాలి.

దేశంయొక్క ప్రధాన రాజకీయ సంస్థయైన కాంగ్రెసు తిరిగి పనిచేయనంతకాలం ప్రజలలో సామాన్య రాజకీయ జీవితం ప్రారంభంకాదు. కాంగ్రెసు నాయకులు కాంగ్రెసు సంస్థద్వారా ప్రజలలో పనిచేస్తే, యితరులు కాంగ్రెసుకోవున్న మంచిని గ్రహిస్తారు. తాముతమ పొరపాట్లను సరిదిద్దుకుంటారు.

రాష్ట్రాల్లో మంత్రివర్గాలేర్పడాలి

(3) నిలవ వ్యాపారస్తుల్ని అణచి, లంచగొండి ఉద్యోగస్తుల్ని కఠినంగా శిక్షించి, ప్రజల్ని కాపాడ్డానికి రాష్ట్రాలలో మంత్రివర్గాల నేర్పరచాలి.

ఇలాంటి కార్యక్రమాన్ని అమలు జరపడానికి సంయుక్తమంత్రివర్గాలే చక్కని మార్గం. ప్రజలకు సేవచేయడంలో వివిధ పక్షాల దేశభక్తులు ఒకరినొకర్లు అర్థం చేసుకుంటూ, ఐక్యతతో పని చేయడానికప్పుడు అవకాశం లభిస్తుంది కాని, నేటి పరిస్థితుల్లో ఎడ్వైజర్ల పరిపాలనకంటె ప్రజా ప్రతినిధులతో గూడిన ఏమంత్రివర్గమైనా మంచిదే.

నిర్మాణ కార్యక్రమానికి మాత్రమే ప్రాధాన్యత యిచ్చి, మంత్రివర్గాలను వ్యతిరేకిస్తే, యుద్ధకాలంలో మన ప్రజలకు జరిగిన అన్యాయాలపట్ల కళ్ళు మూసుకోవడమన్న మాట. రాష్ట్రాలలో ప్రజా ప్రతినిధులు అధికారంలో లేకపోతే, నిలవ వ్యాపారస్తుల్ని అణచలేం. ప్రజలకు కావలసిన జీవితావసర వస్తువులను న్యాయంగా పంపకం చేయించలేం. ఎడ్వైజర్ల పరిపాలన యిలాగే కొనసాగితే, నిలవ వ్యాపారస్తులు లాభాలమీద లాభాలు సంపాదిస్తారు; ఉద్యోగులు లంచగొండులై, ప్రజలను పీడిస్తారు. కాబట్టి, ప్రజలకు నిజంగా సేవచేయదలచుకుంటే, రాష్ట్రాలలో మంత్రివర్గాలేర్పడాలి.

నేడు మనకొక పరీక్షా సమయం. మన జాతీయ ఆశయాలు నెరవేరేది సామ్రాజ్యవాదుల సహాయంతోనా? లేక అన్యోన్యంగా ఏకాభిప్రాయానికి రావడంద్వారానా? మొదటి మార్గమవలంబిస్తే, ప్రస్తుతంఉన్న రాజకీయ విభేదాలు జాతీయ విచ్ఛిన్నానికి దారితీస్తాయి. మరికొంతకాలం సామ్రాజ్యవాదుల పెత్తనం కొనసాగుతుంది. రెండవమార్గం జాతీయైక్యతకు, సామ్రాజ్యవాదులఓటమికి, దారితీస్తుంది.

మొదటిమార్గం మన బానిస ప్రవృత్తికి చిహ్నం; రెండవమార్గం మన దేశభక్తికి దాఖలా. మనందరిలోను యీ రెండు లక్షణాలూ కొద్దిగానో, గొప్పగానో, ఉన్నాయి.

ఎంత విశాలహృదయంతో మనం యితరుల్ని చూడగలుగుతాం? ఎంత కుశాగ్రబుద్ధితో యితరుల దృక్పథాన్ని అర్థంచేసుకోగల్గుతాం? అనే ప్రశ్నకు నేడు అందరం సమాధానం చెప్పుకోవలసియుంది. అప్పుడే, ఏవ్యక్తిఐనా, లేక ఏ సంస్థఐనా, భారతదేశ భవిష్యత్తును నిర్ణయించడంలో ఎలా తన పాత్రను నిర్వహించడమో తేలుతుంది. అప్పుడే, యీమన అంతిమ స్వాతంత్ర్య సమరంలో ఒక్కొక్కరి స్థానం నిర్ణయమౌతుంది.

పట్టాభికి జవాబు

(2వపేజీ తరువాయి) కాంగ్రెసును మరింతఊబిలోకి తీసుకుపోయింది. ఉదాహరణకు, మష్రూవాలాగారే అంగీకరించారుగదా! అమెరీ మాటలువిని, పొరపడి, "రైలుపట్టాలు పీకడం, బ్రిడ్జీలను కూల్చడం" వగైరాలు సమర్థించి, తాము పెద్ద తప్పుచేశామని మష్రూవాలాగారు నిజమైన గాంధీభక్తునివలె అంగీకరించారు.

ఆంధ్రరాష్ట్ర సర్క్యులర్‌నుచూచి, మష్రూవాలా మొదటి ప్రకటనను (ఇప్పుడు పొరపాటని అంగీకరించినదానిని) చూచి, అనేక మంది కాంగ్రెసుభక్తులు మోసపోయారు. ఆంధ్రదేశంలో అనేకమంది కాంగ్రెసు సోదరులు "రైలుపట్టాలు పీకడం, వంతెనలు కూల్చడం" వగైరా పనులు కాంగ్రెసు కార్యక్రమమని నమ్మారు. అలాచేయమని అమాయక ప్రజలను ప్రోత్సహించారు. కొన్నిచోట్ల పోస్టాఫీసులను, స్కూళ్ళను తగులబెట్టాలనే విపరీతస్థితికి కూడ పోయింది. ఆ వివరాలలోకి మనం యిపుడు పోవక్కరలేదు. వ్యక్తులపేర్లు కూడ అనవసరం.

కాంగ్రెసు సోదరులు - ముఖ్యంగా ఆగస్టు రోజులలో బయటవుండిపనిచేసిన సోదరులు. గుండెపై చేయివేసికొని ఆత్మపరీక్ష చేసుకోండి! ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు సర్క్యులర్, మష్రూవాలా ప్రకటన-ఆరోజులలో మిమ్ములను ఎలా పొరపాటు పడేలా చేశాయోఆలోచించుకోండి! అలాగే కాంగ్రెసు అభిమానులైన ప్రజలు, ఆరోజుల్లో ఉద్రేక్తులైనవారు నేడు శాంతంగా ఆలోచించండి! సత్యం మీకే బోధపడుతుంది. నాటి పొరపాటు పనులకు మీరు క్షమాపణ చెప్పుకోవాలని మేము కోరడంలేదు. కాని పొరపాటని చరిత్ర రుజువు చేసిందనే విషయాన్ని మాత్రం గుర్తించండి!

ఈ పొరపాటు పంథాకు కారణమైన తన తప్పును మష్రూవాలాగారు ధీమాగా, సత్యాగ్రహిసలె, అంగీకరించారు. తన నిజాయితీని రుజువు చేసుకొన్నారు. తప్పుడుపంథాన పడిన కాంగ్రెసు సోదరులను దిద్దడానికి తన కర్తవ్యాన్ని నెరవేర్చారు.

పై గాంధీభక్తుని ఉదాహరణనుంచి పట్టాభిగారుకూడా పాఠం నేర్చుకోవాలని కోరుతాను.

తప్పుడు పంథాకు దారితీసిన సర్క్యులరును సమర్థించడం ఇక మానుకోవాలి. తాముచేసిన పొరపాటును గుర్తించాలి. సర్క్యులర్‌లోని కార్యక్రమం చరిత్రవల్ల పొరపాటని రుజువయింది. అసంగతి గుర్తించగలిగినపుడే, కాలానికి-పరిస్థితులకు తగిన కార్యక్రమం వేసుకోగలుగుతారు. ఈసత్యం గుర్తించలేకపోవుటవల్లనే పట్టాభిగారు బెజవాడ ఉపన్యాసంలో భవిష్యత్తుకు ఎట్టి కార్యక్రమం ఇవ్వలేకపోయారు. ఇదే తమ దృక్పథంలోఉన్న లోటును చూపుతూంది.

సామ్రాజ్యవాదులమీద ఇంకా ఆశ

అదేవిధంగా, సభలోని యితర ఉపన్యాసాల నొకసారి గమనించండి. కాశేశ్వరరావు తిరుమలరావుగార్లు జిన్నాను తిట్టిపోశారు. జిన్నాను లిన్‌లిత్‌గో పెంచి పెద్దను చేశాడని, బ్రిటిషు ప్రభుత్వ ఏజెంటు అని అన్నారు. రెండోవైపున వేవెల్ ప్రభువును పొగడారు. ఇంతవరకు కాంగ్రెసు ఎల్లవుడు ఆటంకాలుపెట్టే కార్యక్రమం అనుసరించుతూందని బ్రిటిషుప్రభుత్వం అనుకునేదట! కాని ఇపుడు సిమ్లా రాయబారాలలో కాంగ్రెస్ నిర్మాణ సహితమైన పంథా అనుసరించుతున్నట్లు ప్రభుత్వం గ్రహించిందట! తిరుమలరావుగారి ఉపన్యాసంలో "కాంగ్రెసు జంటిల్‌మెన్ పంథా అనుసరించుతూన్నట్లు" వేవెలు గ్రహించాడని చెప్పుకున్నారు. దీనిలోని వైరుధ్యంచూడండి! ఒకవైపు జిన్నాను బ్రిటిషువారి ఏజెంటు అని నిందించుచున్నారు. రెండోవైపున "కాంగ్రెసువారిని జంటిల్‌మెన్‌గా" వేవెల్ గుర్తించాడని సంతోషించుతున్నారు. మనం కలసి పనిచేయాలనిపించుతుంది. వెనుక నిందించడం, ఇద్దరికీ-దేశానికీ శత్రువయిన బ్రిటిషు సామ్రాజ్యవాదులమీద ఆశ పెట్టుకోడం జరుగుతోంది. ఉదాహరణకు, పట్టాభిగారే ఏమన్నారోచూడండి: "ఈ రాజకీయ ప్రతిష్టంభన రెండు లేక మూడు నెలలకంటె ఎక్కువకాలం ఉండబోదని నా అభిప్రాయం. భారతీయుల సహకారంలేనిదే భారతదేశాన్ని తమ ఆధీనంలో వుంచుకోలేమని బ్రిటిషువారు అవగాహనచేసుకొన్నారు" (ఆంధ్రపత్రిక రిపోర్టు) అని పట్టాభిగారు సంతృప్తిపడుతున్నారు. మనం యిలా పోట్లాడుతూంటే, బ్రిటిషు సామ్రాజ్యవాదులు యిచటనే తిష్టవేస్తారు-అనే సత్యాన్ని పట్టాభిగారు గుర్తించాలి. ఇలాంటి భావాలకు తావిచ్చిన తమ పాలసీని పునరాలోచించుకోడం అవసరమని పట్టాభి సీతారామయ్య పంతులుగారు గ్రహింతురుగాక. 22–7–45

బాపట్లతాలూకా చేనేత పారిశ్రామిక తృతీయ మహాసభ

పందిళ్లపల్లిలో: జులై 29

అధ్యక్షులు: శ్రీ సజ్జా భాస్కరరావుగారు

ప్రారంభకులు: శ్రీ పుత్సల సత్యనారాయణగారు

జండా ప్రతిష్ఠాపన: శ్రీ మానెం పట్టయ్యగారు

అఖిలభారత చేనేతబోర్డు సభ్యులు శ్రీ మువ్వన విశ్వనాథం, శ్రీ మాదాని సోమప్పగారు, గుంటూరుజిల్లా కంట్రోల్ ఆఫీసరుగారు, శ్రీ కస్తూరి కుటుంబరావుగారు ఇంకా పలువురు చేనేత ఉద్యమనాయకులు మహాసభలో పాల్గొంటారు.

రాత్రి కామ్రేడ్ నాజరుదళం బుర్రకథ, ఇతర వైజ్ఞానిక ప్రదర్శనాలు జరుగుతాయి.

రైతులపై అక్రమాలు

వెంకటగిరి ఎస్టేటులో రైతులు అసలే మామూలు శిస్తురేట్లు, కంచెపుల్లరి రేట్లు- యిచ్చుకోలేక, నానా అవస్థలు పడుతూంటే, 100 కి 30 చొప్పున ఈమధ్యనే పుల్లరి రేట్లు పెంచబడ్డాయి. ఎస్టేటు ఉద్యోగస్తులు, ఇస్తారా చస్తారా అని కూర్చున్నారు. అదనంగా పెంచిన యీరేటు ఇచ్చుకోలేమంటూ దాదాపు 80 గ్రామాల ప్రజలు తమ అసంతృప్తిని వెల్లడిచేశారు. కాని, కుతంత్రాలకు వెంకటగిరి వారిది అందెవేసిన చేయి. జమీందారు మొదలుకొని ఫారెస్టుగార్డువరకు గ్రామాలలో పార్టీలను ప్రోత్సహించ నారంభించారు. మీకు చెరువు మరమ్మతుచేయిస్తామని కొన్ని గ్రామాలలోను, పాతబాకీలు రద్దుచేస్తామని మరికొన్ని గ్రామాలలోను, శిస్తు వసూళ్ళలో కొంత మినహాయిస్తామని యితర గ్రామాల్లోను - ప్రచారంచేసి, 40 గ్రామాల పెత్తందార్లను లోబరచుకున్నారు. వాళ్ళ ద్వారా గ్రామస్థుల్ని మభ్యపెట్ట సాగారు. ఈవిధంగా మాయోపాయంవల్ల 40 గ్రామాలను చీలదీయగలిగారు. అక్కడి రైతులు అదనపు పుల్లరి రేటును చెల్లించివేశారు. మిగతా 40 గ్రామాలు చెల్లించలేదు.

ఇక జమీందారీ ఉద్యోగస్తుల ప్రతాపం చూచుకోండి! ఈ 40 గ్రామాలలో రైతుల మీద అక్రమ కేసులు పెట్టి, కోర్టులచుట్టూ తిప్పుతున్నారు. కంచెలోకి పశువులు పోయాయని కొందరిమీద, కట్టెలు కొట్టారని కొందరిమీద, కంప చెరిగారని మరికొందరి మీద - యిలా కేసులపై కేసులు బనాయిస్తున్నారు.

రైతులు అనాదినుంచీ అడవిలోవున్న కట్టె, కంప, పచ్చి ఆకు మొదలైనవి ఉచితంగా తెచ్చుకుంటున్నారు. కాని యిటీవల జమీందారీ ఉద్యోగులు రైతుల్ని ఆటంకపరుస్తున్నారు. ఉదాహరణకు: అలిమిలి, నెమ్మూరు గ్రామాల్లో రైతులు నిలవచేసుకున్న కంప తొడుగులను ఒక జమీందారీ బంటు కాల్చివేయించాడు.

ఇలా అక్రమ కేసులు, దౌర్జన్యాలు మితిమీరిపోతున్నాయి. అన్నిగ్రామాల రైతులు మేల్కొని, యీ జమీందారీ దాడిని సంఘబలంద్వారా ఓడించవలసి యుంటుంది.

పరుచూరి రామకోటయ్య,
కార్యదర్శి, వెంకటగిరి డివిజన్ రైతుసంఘం.

★

కరువుబాధితులనుండి లంచాలు

చీపురుపల్లి తాలూకా రైతుసంఘాధ్యక్షుడు ఇలా రాస్తున్నాడు:

చీపురుపల్లి తాలూకాలో అనేక కుటుంబాల వారు కరువుకు తట్టుకోలేక, తిండి కోసం భూములను తనఖాలు పెట్టడం, విక్రయించడం జరుగుతోంది. ఈవిధంగా ఆస్తులు కోల్పోయే వారిలో పేద రైతులేగాక మధ్య తరగతి వారుకూడ ఉన్నారు. అగ్నికి గాలి తోడయినట్లు, కరువుకు వుద్యోగుల లంచగొండితనం, దౌర్జన్యాలు మితిమీరి పోతున్నాయి. దీనిలో అగ్రతాంబూలం చీపురుపల్లి సబ్‌రిజిస్ట్రారు సారథి నాయుడుగారిది. పైన వివరించిన విధంగా రైతులు ఆస్తులను అమ్ముకొని రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చినప్పుడు స్టాంపు ఖరీదుకు సమానంగా రహస్య ఫీజు ఇవ్వకుంటే పార్టీలను కసురుతూ, తప్పులను కల్పించి స్టాంపులను రద్దు చేయుచున్నాడు. లంచం వసూలు చేయడానికి మధ్య సత్యలింగం అనేగుమస్తాను నియమించుకున్నాడు. తాను ఆశించిన లంచం రానప్పుడు, వారంరోజుల ఇవ్వనిదే రిజిస్టరీ చేయబడదని చెప్తున్నాడు. అలా ఇచ్చేపందుకు రసీదులులేవు!

తాలూకాలో వివిధ గ్రామాలనుండి ప్రజలు సబ్‌రిజిస్ట్రారు చర్యను ఖండిస్తూ రిపోర్టులు పంపుకుంటున్నారు. వీటిలో మొదటగా చుక్కవలస గ్రామం కంప్లయింటు పై 1-7-45 వ తేదీని జిల్లా రిజిస్ట్రారుచే చీపురుపల్లిలో విచారణ జరిగింది. 12 గురు పిర్యాదులు నేరాన్ని ఋజువు చేశారు. కాని జిల్లా రిజిస్ట్రారువల్ల కూడా రైతులకు న్యాయంజరిగినట్లు కనబడదు. విచారణ సమయంలో మధ్య మధ్య "మిమ్ములను ఎరస్టుచేస్తా ఇలాంటి కంప్లయింట్లు ఇటుపైన పెట్టకుండా ఉండడానికి" అనే అధికారి ప్రజలకు న్యాయమెలా ఇప్పించగలడు? ఇంకా గ్రామాల నుండి పై ఉద్యోగస్తుని చర్యను ఖండిస్తూ పిటీషన్లు పెట్టుకుంటున్నారు. వాటన్నిటిని విచారణచేసి ప్రజలకు న్యాయమిప్పించుటలో ప్రభుత్వం జోక్యం కలిగించుకోవాలని కోరుతున్నాను.

★

రేపల్లెతాలూకా వ్యవసాయశాఖవారి చర్యలు

రేపల్లెతాలూకా వ్యవసాయ డిపార్టుమెంటువారు తాలూకా అవసరాలకు మించి విత్తనాలువిల్వచేయుటలో రైతాంగాన్ని కొన్ని యిబ్బందులకు లోనుచేస్తున్నారు. క్రిందటి సంవత్సరం, 4000 బస్తాల విత్తనాలు విల్వచేసి, ఎరువులకు - విత్తనాలకు పోటీపెట్టి 1181 బస్తాలు మాత్రం ఖర్చుపెట్టగలిగారు. మిగిలిన 2819 బస్తాలు వ్యాపారులకు అమ్మవలసిన పరిస్థితులువచ్చాయి. ఈసంవత్సరము తిరిగి 6000 బస్తాల విత్తనాలు విల్వచేశారు. ఇవి ఖర్చుపెట్టుటకు రైతులకు క్రిందివిధముగా యిబ్బందులు పెడుతున్నారు: విత్తనాలు తీసుకొంటేనే ఎరువులుగాని, వ్యవసాయ పనిముట్లుగాని యిస్తున్నారు. సాధారణంగా మాగాణి ప్రాంతాలలోని రైతులు వారికికావలసినవిత్తనాలు విల్వచేసుకొంటారు. డిపార్టుమెంటు వారు ఎక్కువ విత్తనాలు తీసికోవటంవల్లనూ, సరిగా ఏరి తయారు చేసియుండక కేశి ఉండుటవల్లను కూడా రైతులు తీసుకొనుటకు వెనుకాడుతున్నారు. భూములు లేనివారికి వ్యవసాయ పనిముట్లు కావలెనన్నా, విత్తనాలు తీసుకోవలెననే నిబంధన పెట్టుటవల్ల చాలామంది యిబ్బంది పడుతున్నారు. కొంతమంది పారలు, వ్యవసాయ పనిముట్ల అవసరాన్నిబట్టి విత్తనాలు తీసుకొని ప్రక్కనే వ్యాపారులకు కొంతనష్టంమీద అమ్మటంకూడా జరుగుతోంది. విత్తనాలు తీసుకొని మేము బాగుపడలేము అనే వారికి పారకు సొను 1కి 0-2-9 కి గాను 0-3-0 చొప్పున, వేరుశనగపిట్టు బస్తా రు.7-14-0కి గాను, 8-0-0 చొప్పున అదనంగా తీసుకొంటున్నారు. తాలూకాలో నార్లు పోసుకోవటం కూడా అయిపోయింది. అయినా ఒక బస్తా విత్తనాలు తీసుకొంటేనే పదిబస్తాల చొప్పున ఎరువులు యిస్తున్నారు. ఇప్పుడు విత్తనాలు తీసుకొని ఏమిచెయ్యాలో తెలియకున్నది. ఇన్ని పోటీలుపెట్టినా, 3000 బస్తాలు మాత్రమే ఖర్చుపెట్టగలిగారు. ఈ పరిస్థితులు గుర్తించి పై అధికార్లు వెంటనే జోక్యం కలుగచేసుకొని, విత్తనాలు తప్పని సరిగా తీసుకోవాలనే నిబంధన తీసివేయాలి. ఈతాలూకాకు యిప్పటికి 60 ఐతల పట్టాలు మాత్రమే వచ్చాయి. మిగతవి ఎన్నిటన్నా వచ్చినా, పారరేకులు, మిషన్‌లో కోసివేసిన బద్దెముక్కలు మాత్రమే. తాలూకాలో బండి పట్టాల కరువు విపరీతంగా ఉన్నది. కావున పైఅధికార్లు ఈ తాలూకాకు కనీసం 150 ఐతలు పంపే ఏర్పాటుచేస్తూ, విత్తనాలపోటీ తీసివేసి వ్యవసాయ డిపార్టుమెంటుకి – రైతులకి సన్నిహిత సంబంధం కల్పించాలనికోరుచున్నాను.

— పొన్నపల్లి లక్ష్మీనారాయణ

కామ్రేడ్ యల్లమంద మనకు లేడు!

★

కామ్రేడ్ యల్లమంద 35 సంవత్సరాలైనా నిండకమునుపే - జూన్ 28 వ దివంగతులైనారు. దావులూరు (గుంటూరుజిల్లా) ప్రజలకు ఒక అండ పోయింది. ప్రజా విరోధుల పాలిటి ఒక సింహం అస్తమించింది. ఒక వజ్రపుతునక మనల్ని వీడింది.

కామ్రేడ్ యల్లమంద జీవితంలో ఒక ప్రత్యేకతఉంది. కులానికి మంగలి, పుట్టింది పేదకుటుంబంలో. చిన్న - పెద్ద, ధనిక-బీద అనే భేదం లేకుండా అందరి మన్ననలు సంపాదించాడు. ప్రజలకు ఏ మాత్రం అన్యాయం జరిగినా, సహించేవాడుకాదు. ఎంతటి కష్టాలకైన ఓర్చి ప్రజా విరోధులను ఎదుర్కొనేవాడు. రహస్యదినాలలో యితనికి పార్టీతో సంబంధం ఏర్పడింది. రహస్యంగా తిరిగే కామ్రేడ్స్‌కు ఎంతగానో తోడ్పడ్డాడు. 1941లో పార్టీలోచేరి, తన జీవితాన్ని పార్టీకి అంకితం చేశాడు.

కామ్రేడ్ యల్లమంద శవాన్ని పార్టీ ఆఫీసు ముందుంచారు. ప్రజలు తమకు చేసినమేలుకు కృతజ్ఞతగా, కడసారిచూపుకుచుట్టూమూగారు. కన్నీరు టొటటొటా కారుతూంది. "ఒక పులిపోయింది," అంటూనిలపించిందొకముసలి వృద్ధు. కామ్రేడ్సంతా శవంతో బయల్దేరారు. వెంట 400 మంది ఉన్నారు. శవం స్మశానం చేరింది సమాధిచేశారు. కామ్రేడ్ చింతల అతని జీవితాన్నిగూర్చి ఉపన్యసించాడు. "కామ్రేడ్ యల్లమంద మనకికలేడు. కాని అతని జీవితాశయం - ప్రజలకు జరిగే అన్యాయాలను ఎదుర్కోవాలి అనే ఆశయం - సజీవంగానే ఉంది. వేయిరెట్లుగా ఆ ఆశయాన్ని ముందుకు తీసుకుపోతా"మని గ్రామ కామ్రేడ్సంతా శపథం చేశారు. అంతాకలసి అర్పించిన విప్లవ జోహారులతో, సమాధిపైనున్న ఎర్రజండా రెపరెపలాడింది.

అధికార దుర్వినియోగం

★

కోదూరు వెంకట కృష్ణారావుగారు, కృష్ణాజిల్లా మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్సు యూనియన్ జగ్గయ్యపేట బ్రాంచి, సహాయకార్యదర్శి యిలా రాస్తున్నారు:

బస్సు వర్కర్ల కష్టాలకు మితిలేదు. ఒకవైపు జీతాలు చాలక, యూనిఫారమ్స్ లేవనే నెపంతో వేసేఫైనులు భరించలేక, నానా ఇబ్బందులుపడుతూంటే, యినిదాలవాలన్నట్లు అధికారుల నిరంకుశ చర్యలు మితిమీరుతున్నాయి. ఏఉద్యోగయినా బదిలీ అయినా, టీపార్టీలకు వెళ్లాలన్నా, తీర్థయాత్రలకు వెళ్లాలన్నా—వారి యింటికి ప్రయాణికులందరితో బస్సును తీసికొనివెళ్ళ ఎంతటైమయినా ఆపవలసిందే. ఎవరైన టైముకు వెళ్లిపోవాలని వెళ్ళితే, వారిపై తమ అధికార దుర్వినియోగంతో కేసులు పెట్టడమో, లేక తిట్టడమో, కొట్టడమో కూడ కద్దు.

ఈనెల12వతేదీన జగ్గయ్యపేటలో డిప్యూటీ తహసిల్దారుగాపనిచేసి బెజవాడ మేజిస్ట్రేటుగా బదిలీ అయిన చలపతి రావుగారు తన యింటికి బస్సును తీసికొని వెళ్ళి తన మామను ఎక్కించుకొని రాలేదనే నెపంతో, బెజవాడకు చిన్నకారుమీద తమ వెళ్ళుతూ జగ్గయ్యపేటకు షుమారు $1\frac{1}{2}$ మైళ్ళదూరంలో ఎం. డి. కె. 191 నెం. బస్సును క్రాస్‌చేసి ఆపి డ్రయివరు, కండక్టరులను బయటకులాగి, తిట్టి అమానుషంగా కొట్టారు. వీరి యీ నిరంకుశచర్యను వర్కర్లంతా తీవ్రంగా నిరసిస్తున్నారు. ఇట్టిఅధికారులపై, ముఖ్యంగా వీరిపై, వెంటనే తగుచర్యతీసికోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

కొత్తపేట తాలూకా రైతు సంఘ కార్యవర్గ సమావేశం

★

ఈ నెల 9 వ తేదీని పై సమావేశం ఈతకోట గ్రామంలో శ్రీ ముళ్ళపూడి రామచంద్రరావుగారి అధ్యక్షతను జరిగింది. ఈ క్రింది తీర్మానములు గావించబడినవి.

1. పేరవరం సంపింగు స్కీముక్రింద భూములు ఒకేసారి దంప సాగుక్రింద దమ్ము రాజాలనవి. క్రమక్రమంగా వాటిని మార్చుకొనుటకు అవకాశమివ్వాలని, భూములమరమ్మతుకు అవసరమైన అప్పులు ఎరువులువగైరా విరివిగా సప్లయి చెయ్యాలని ప్రభుత్వమును యీ సభవారు కోరుచున్నారు.

2. పై స్కీముక్రింద నున్న ప్రతి గ్రామానికి మెరకపైర్లు వేసుకోడానికి కొంత భూమిని ప్రత్యేకించాలని, ఈ కొత్త కాల్వలకు అవసరమైన అన్నిచోట్ల పంటతూరలు, మురుగు తూరలు, వంతెనలు ఏర్పాటుచేయాలని, కోరుతున్నారు.

దేవరపల్లి, ఈతకోట గ్రామాలకు సంబంధించిన ఇర్రిగేషన్ సమస్యలపై మరికొన్ని తీర్మానములు గావింపబడినవి.

పారిశ్రామికాభివృద్ధిని అరికట్టడం స్వాతంత్ర్యానికి మార్గంకాదు

★

కుమారప్పగారికి సమాధానం

కృష్ణా పుష్కరాల సందర్భంలో ఈ నెల 17 తేదీన బెజవాడలో ఖాదీ, గృహపరిశ్రమల ప్రదర్శనం తెరవబడింది. ఆ సందర్భంలో జరిగిన సభకు అధ్యక్షత వహిస్తూ సేవా గ్రామంనుంచి వచ్చిన జె. సి. కుమారప్పగారు ఏమన్నారో చూద్దాం.

బ్రిటిష్ పారిశ్రామిక వస్తువులు మన దేశంలో దిగుమతి కావడం ప్రారంభమైనప్పటినుంచి మన గృహపరిశ్రమలు ఏలా నాశనమయాయో, దేశంయేలా పేదరికంలో మునిగిపోయిందో, యెలా రాజకీయ దాస్యత్వం సంప్రాప్తమయిందో, కుమారప్పగారు వివరించారు. అయితే బ్రిటిష్ పెట్టుబడిదారివర్గాన్ని ఖండించడంతోబాటు పరిశ్రమలన్నింటిపైన-దేశీయ, విదేశీయ విచక్షణ చూపకుండా అయన దాడిసాగించారు. అసలే బ్రిటిష్ పరి[illegible]తో పోటీ చేయలేని దుస్థితిలో ఉన్న దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించడం పోయి [illegible]ల్లు సరుకులు వాడడం అంటే హింసావిధానాన్ని బలపరచడం తప్ప మరొకటి కాదని ఆయన సిద్ధాంతీకరించారు. ఇందుకొక ఉదాహరణ యిచ్చారు. ఒక హంతకుడు ఒక బాలికనుచంపి. ఆమె మెడలోనున్న ఆభరణాన్ని అపహరించి. దాన్ని రహస్యంగా అమ్మడానికి వెళ్ళితే. ఈ గాథ తెలిసిన వారెవరూ దాన్ని కొనరుగదా! అలాగే పెద్ద పెద్ద పరిశ్రమలు పెట్టి. కార్మికరక్తాన్ని పీల్చుతూ. కోట్ల కొద్ది లాభాలు గడించే పెట్టుబడిదార్ల సరుకులు కొనడం మహా పాతకమని కుమారప్పగారు వివరించారు. మనం తాగే కాఫీలో కార్మికుల రక్తాన్ని చవిచూస్తున్నామన్నారు. మనం కట్టుకొనే మిల్లు బట్టలన్నీ కార్మికుల రక్తంతో తడిసి వున్నాయన్నారు. 'కాలినాస్ టూత్ పేస్టుతో' పండ్లుతోముకుంటే లక్షలకొద్ది కార్మికుల రక్తంతో పళ్ళుతోముకుంటున్నట్టే అన్నారు. అమాయక బాలికను హత్యచేసి ఆమె మెళ్ళో ఆభరణాన్ని దొంగిలించిన దుర్మార్గునివద్ద ఆ వస్తువు కొనడం ఎలాపాపమో, అలాగే పరిశ్రమల్లో తయారైన వస్తువులు కొనడం హింసాకాండను బలపరచడమే నన్నారు.

పెట్టుబడిదారీ విధానం

ఒక చారిత్రకదశ

నిజమే: పెట్టుబడిదారీ విధానంలో కార్మికుల్ని కొల్లగొట్టుకోవడంలేదని యెవరూ చెప్పరు. కాని, అసలు ప్రపంచంలో ఏ యే దశలు దాటి పెట్టుబడిదారీ విధానం బయల్దేరిందో, దీనితరవాత మానవాభ్యుదయంకోసం ఎలాంటి పద్ధతి రావలసియున్నదో, చారిత్రక దృష్టితో ఆయన చూడ్డంలేదు. మనుష్యుల్ని పశువులమాదిరిగా అమ్మడం, కొనడం, అనే దశలోనుంచి మధ్య యుగాలనాటి పౌరోహిత విధానంలోకి మానవ సమాజం మారింది. బానిస విధానంకంటె ఈ పౌరోహిత విధానం అనేకరెట్లు మంచిది. ఐతే ఇందులోకూడా దోపిడీ విధానం అనేక రూపాల్లో ఉంది. రైతుగాని, పారిశ్రామికుడుగాని, స్వేచ్ఛగా తన యిష్టంవచ్చిన ప్రదేశానికి వెళ్ళి తన యిష్టంవచ్చిన వృత్తి చేసుకోడానికి హక్కులేదు. జమీందార్లు, కులాధిపతులు ఎక్కడ వుండమంటే అక్కడ ఉండాలి; ఏపనిచెయ్యమంటే అదిచెయ్యాలి. ఈ నిబంధనలను ధిక్కరించినవారిని ప్రభుత్వం అనేక చిత్రవధలకు గురిచేసేది. క్రమంగా యీ దశ పెట్టుబడిదారీ విధానంలోకి మారింది. శాస్త్ర పరిశోధనలవల్ల మనిషికి కావలసిన ప్రతి వస్తువు సులభంగాను, చౌకగాను తయారౌతోంది. భూగర్భంలో దాగివున్న సహజ సంపదలన్నీ పైకి తీస్తున్నారు. వాటిని మానవుని ఉపయోగార్థంఫ్యాక్టరీలలో వస్తువులుగా తయారు చేస్తున్నారు. ప్రతివానికి వ్యక్తి స్వాతంత్ర్యం ఏర్పడింది. ఎవరి ఇష్టంవచ్చిన వృత్తి వారు చేసుకోవచ్చు: ఎక్కడికి వెళ్ళాలన్నా వెళ్ళవచ్చు: సంఘాలుగా చేరి తమ హక్కులకోసం పోరాడవచ్చు.

అయితే. పెట్టుబడిదారీ విధానంలో కూడా దోపిడీవుంది. కార్మికులు ఫ్యాక్టరీలలో వస్తువులు తయారుచేసినందుకు న్యాయంగా వారికి రావలసిన ప్రతిఫలం రావడంలేదు. అధిక భాగం యజమానులపహరిస్తున్నారు. రాజ్యాంగయంత్రం యజమానుల చెప్పుచేతలలో ఉంటుంది. ఇదంతాచూచి అనేక దేశాలలో విజ్ఞానవేత్తలు ఆలోచించసాగారు. కార్మికులకు న్యాయంగా రావలసిన ప్రతిఫలంకోసం పోరాటాలు నడుపుతున్నారు. కొన్నిచోట్ల గెలుస్తున్నారు; కొన్నిచోట్ల ఓడిపోతున్నారు. మానవుని బుద్ధి వికాసంవల్ల లభించిన శాస్త్ర విజ్ఞానాన్ని ప్రజల శ్రేయస్సుకు వినియోగించి, ప్రతి వ్యక్తి చేసేకష్టానికి న్యాయమైన ప్రతిఫలంకోసం పాటుబడుతున్నారు.

కాని. కుమారప్పగారికి కావలసింది ప్రజా ఉద్యమాల ద్వారా పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మూలించి అంతకన్నా శ్రేష్ఠమయిన వ్యవస్థను స్థాపించడం కాదు. గృహపరిశ్రమల ద్వారా వెనుకటి పౌరోహిత విధానానికి జారిపోవడం వారికి కావలసింది. శాస్త్రపరిశోధనలను సాధనంగా ఉపయోగించుకొని మరొక మెట్టు పైకి వెళ్ళడం కాదు: శిథిలమై బూజుపట్టిన ఫ్యూడల్ విధానానికి దాసోహం చేయడం, వారు కోరుతూంది.

ఇది 1945 లో ఎంతవరకు ఆచరణయోగ్యం? ఆధునిక యుగంలో పరిశ్రమలు, పారిశ్రామికోత్పత్తి ప్రతిమనిషి జీవితంతోను పెనవేసుకుపోయాయి. ఏ 16వ శతాబ్దంలోనో అయితే, కుమారప్పగారి ప్రచారం అవసరం లేకుండానే భారతీయులు గృహ పరిశ్రమలను ప్రోత్సహించేవారు. కాని, యీ రోజున అది సాధ్యంకాదు. ఉదాహరణకు, కుమారప్పగారు తన సందేశాన్ని ప్రజల కందజేయడానికి దూరశ్రవణ యంత్రం అవసరమైంది. అది తయారుకావడంలో కొన్ని వేలమంది కార్మికులు తమ రక్తాన్ని ధారపోసి ఉండాలి: ఆయన ధరించిన కళ్లద్దాలలో కార్మికుల రక్తంఉంది: ఆ రక్తంగుండా ప్రజల్ని చూస్తున్నారు: ఆయన జేబుగడియారం నిండా కార్మికుల రక్తమే: కుమారప్పగారు సేవాగ్రాంలో బయల్దేరి, రైల్లో ప్రయాణంచేసివచ్చారంటే, 8 లక్షలమంది రైల్వే కార్మికుల రక్తంలో యీదుకుంటూ వచ్చారన్నమాట. ఆయన ధరించిన ఖద్దరు వస్త్రాలు మిల్లు దారంతో కుట్టినవేగాని, రాటంమీద తయారైన దారంతో కాదు. ఇలాగే, చెప్పవలసి వస్తే ఎన్నో ఉన్నాయి. ఆయన కాగే మంచి నీళ్ళుసైతం పైపుల గుండా రావాలి. అవి కర్మాగారాలలో తయారైనవే.

పోనీ, చేత్తో తయారైన వస్తువులే వాడ్డంవల్ల ప్రజలకు కడుపునిండా తిండి దొరుకుతుందా, అంటే అదీలేదు. మనం తినేబియ్యం ధాన్యంలోంచివస్తాయి. అధాన్యాన్ని పండించే రైతు నేడు యేస్థితిలో ఉన్నాడు: పన్నుల భారంతోను, అప్పుభారంతోను కృంగిపోతున్నాడు. ఫ్యాక్టరీలలో కార్మికుల రక్తాన్ని యజమాని పీలుస్తున్నట్టే, జమీందార్లు, సామ్రాజ్యవాదులు, వడ్డీవ్యాపారస్తులు, దొంగవర్తకులు, రైతుల్ని కొల్లగొట్టుకుంటున్నారు. అలాంటి ధాన్యం బియ్యంగాచేసి తినడంవల్ల-అబియ్యం దంపుడుబియ్యమే ఐనప్పటికీ-రైతుల రక్తాన్ని మనంకూడా తాగడం లేదా?

ప్రజల పేదరికాన్ని, గృహపరిశ్రమల ద్వారా కొంతవరకు తగ్గించగలుగుతామనేది నిజమే. కాని దానికికొన్ని హద్దులున్నాయి. అసలు సమస్య ఏమంటే, బ్రిటిష్ పెట్టుబడిదారుల యినుపపిడికిలినుంచి మనదేశాన్ని ఆర్థికంగాను, రాజకీయంగాను రక్షించడం. ఇందుకు దేశీయ పరిశ్రమలను విరివిగా ప్రోత్సహించాలి. ప్రభుత్వం కల్పించే ఆటంకాలను ఎదుర్కోవాలి. కనుకనే, అఖిలభారత కాంగ్రెసు కమిటీ జవహర్లాల్‌నెహ్రూ అధిపత్యాన ఒకప్లానింగ్ కమిషన్‌ని నియమించింది. దేశంలో ఎక్కడెక్కడ పరిశ్రమలకు అవకాశాలున్నాయో పరిశీలించి, ఒక ప్లాను ప్రకారం వాటిని అభివృద్ధిచేయడానికి మార్గాలాలోచించడమే దాని ముఖ్యోద్దేశం. భారత జాతీయ కాంగ్రెసే ఈ విధంగా పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేస్తుంటే కుమారప్పగారు మధ్యయుగాలనాటి పురోహిత రాజ్యంవైపు దృష్టిని మరల్చారు: నిజంగా ఆయన కార్మికుల్ని దోచుకునే విధానాన్ని నిర్మూలించదలచుకుంటే, కార్మికుల హక్కులకోసం పోరాడవచ్చు: వారి ఉద్యమాలలో లీనమై పనిచేయవచ్చు.

— కంభంపాటి సత్యనారాయణ

విద్యార్థి సౌకర్యాలకు ★ ★ అందరూ కృషిచేయాలి

గన్నవరం హైస్కూలులో యీ సంవత్సరం నూతనంగా విద్యార్థులను చేర్చుకోరని హైస్కూలు తెరవకముందే తెలిసింది. విద్యార్థులకు కావలసినవన్నీ గదులులేవని. నూతనంగా విద్యార్థులను చేర్చుకొనినచో క్రొత్తగా పాకలు వేయవలసివచ్చునని. అందుకు ప్రయత్నాలు అధికారులు ఏమీ చేయనందున నూతన విద్యార్థులు చేర్చుకోబడరని తెలియచేశారు. ఈ పరిస్థితినిచూచి తాలూకా రైతు సంఘం, విద్యార్థుల సంరక్షకుల (Parents) సమావేశం జరిపి పరిస్థితిని చర్చించుటకు గాను ఒక కరపత్రం వేసింది. సంరక్షకుల సమావేశమై పేరెంట్సు అసోసియేషన్ ఏర్పరచి, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విద్యార్థుల ఎకామిడేషన్‌కొరకు జిల్లాబోర్డు అధికారులను కలుసుకొనుటకు ఒక ఉపసంఘం ఏర్పడింది. ఉపసంఘం జిల్లాబోర్డు అధికారులను కలుసుకొని పరిస్థితిని చర్చించింది: జిల్లాబోర్డులో డబ్బులేనందున ఏమీ పాకలు వేయుటకు వీలులేదని అధికారులు చెప్పారు. చందాలు వసూలుచేసి మేమే పాకలు నిర్మిస్తామని చెప్పగా అందుకు ఒప్పుకున్నారు. నూతనంగా చేరే విద్యార్థులవద్దనుండి, ఇంకా యితరులమండి విరాళాలు వసూలుచేసి 16 ఖిట్టాళ్ళపాకను నిర్మిస్తున్నారు. దీనివల్ల 3, 4 ఫారములు డివిజన్సుచేయుటకు వీలవుతుంది. ఎన్నాళ్ళనుండో కొరతగానున్న టిఫిన్‌షెడ్ లేనిలోపం తీరుతుంది. ఇంకా యితరక్లాసులు డివిజన్సు చేయవలసివచ్చినా పరవాలేదు. పేరెంట్సు అసోసియేషన్, తాలూకా రైతు సంఘం తాము స్వయంగా బాధ్యత తీసికొని పాకలను నిర్మించుటకు కృషిచేస్తున్నారు. ఈ నెల 6 వ తేదీలోగా పాకను నిర్మించాలి. నిర్మించగానే విద్యార్థులను చేర్చుకుంటారు. హైస్కూలు ఆవరణలోనున్న తాటిచెట్లనుకొట్టి ఉపయోగించుటకు జిల్లాబోర్డుశాంక్షన్ చేసింది.

— పేరెంటు ఎసోసియేషన్.

పునాదిపాడు విద్యార్థికాంగ్రెసు వైఖరి

పునాదిపాడు హైస్కూలులో విద్యార్థి ఫెడరేషన్, విద్యార్థి కాంగ్రెసు రెండు సంఘాలున్నవి. అచ్చట విద్యార్థులకు టిఫిన్‌షెడ్డు సైకిల్‌షెడ్డు అవసరమెంతో వుంది. దీనికి విద్యార్థిఫెడరేషన్, విద్యార్థికాంగ్రెసు రెండూ హెడ్‌మాష్టరు వద్దకు డెప్యుటేషన్లు తీసుకు వెళ్ళినవి. ఒక రోజు హెడ్‌మాష్టరుగారు క్లాసులో ఈవిషయాన్ని కదిలించి మనం రూ. 600 వసూలుచేసి వీటిని నిర్మించాలని చెప్పారు. వెంటనే అప్పలాచార్యులు(విద్యార్థి కాంగ్రెసు కార్యదర్శి) లేచి. "ఇచ్చట రెండు సంఘములున్నవి. మాకు బాగా బలమున్నది. మేమే వసూలు చేస్తామ"న్నాడు. తరువాత విద్యార్థి ఫెడరేషన్ వర్కరులేచి అలాకాదు. రెండు సంఘములూ ఈవిషయములో కలిసి పనిచేస్తే తేలికగా చేయగల్గుతామనిచెప్పారు. దానికి అప్పలాచార్యులు అలా ఎన్నటికి వీల్లేదు చేస్తే మేము చెయ్యాలి లేకపోతే మీరు చెయ్యండి. రెండు సంఘములు కలిసి ఎన్నటికి పని చెయ్యటానికి వీల్లేదని సెలవిచ్చారు.

ఈవిధంగా విద్యార్థులందరికి అవసరమయిన కార్యక్రమాన్ని భంగం చేయ సమకట్టడం విద్యార్థి సేవకులమని చెప్పుకునే ఈ విద్యార్థి కాంగ్రెసువారికి తగదు. వెంటనే తమ వైఖరిని మార్చుకొని అందరూ కలిసి ఈ షెడ్డు పూర్తిచేయడానికి తగినదృక్పధాన్ని వలంబించాలని కోరుతున్నాను.

— వీరమాచనేని మధుసూదనరావు.

Editor: M. Chandrasekhara Rao, Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE